పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 729 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ ఆదివారం 27.09.2026 పేజీలు : 8 వెల : 4/-

### లోకేశ్ ట్వీట్..

## అదానీ ఇంధన నిర్వహణ అద్భుతం



- అహ్మదాబాద్‌లో అదానీ గ్రూప్ ఎనర్జీ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి లోకేశ్
- రియల్ టైంలో విద్యుత్ ఉత్పత్తిని పర్యవేక్షిస్తున్న తీరు పరిశీలన
- పర్యటన వివరాలను ఎక్స్ ఖాతాలో పంచుకున్న లోకేశ్

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన అహ్మదాబాద్ పర్యటనలో భాగంగా అదానీ గ్రూప్‌కు చెందిన అత్యాధునిక ఎనర్జీ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ పర్యటనకు సంబంధించిన విశేషాలను ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. అదానీ గ్రూప్ తమ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా రియల్ టైమ్ పద్ధతిలో పర్యవేక్షిస్తున్న తీరును లోకేశ్ పరిశీలించారు. ఈ విధానం వల్ల మెరుగైన పనితీరును సాధించవచ్చని, సత్వర నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని, అలాగే సాంకేతిక అంతరాయాలను తరువాయి 2లో

### ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

## సీఎం సమీక్ష, అలర్ట్ ఆదేశాలు

**వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం**

- ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు
- తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు
- రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల

2లో







### నకిలీ ఆధార్‌లకు

## స్వదేశీ టెక్నాలజీతో చెక్

- నకిలీ ఆధార్ కార్డుల గుర్తింపునకు 'భారత్ ఏబీఐఎస్' అనే కొత్త వ్యవస్థ
- యూఐడీఏఐ పరిశోధకుల ఆధ్వర్యంలో దేశీయంగా అభివృద్ధి
- పరీక్షల్లో నిర్దేశిత లక్ష్యాలను మించి అత్యుత్తమ ఫలితాలు
- భారత పూర్తి డేటాబేస్‌పై ఇంకా విస్తృత పరీక్షలు జరగాల్సి ఉందన్న నిపుణులు

దేశంలో ఆధార్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా భారత పరిశోధకులు కీలక తరువాయి 2లో

### విడుదలైన టెట్ ఫలితాలు

## 70.07% మంది అర్హత

- టీజీటెట్ ఇన్-సర్వీస్-2026 ఫలితాలు విడుదల
- 22,477 మందిలో 15,749 మంది అర్హత
- పేపర్-1లో 68.76 శాతం మంది పాస్
- గణితం, సైన్స్‌లో 73.60 శాతం ఉత్తీర్ణత
- సోషల్ స్టడీస్‌లో 67 శాతం మంది అర్హత

2లో



## భద్రతా మండలి శాశ్వత సభ్యత్వం

### భారత్‌కు గ్లోబల్ మద్దతు



- భద్రతా మండలి శాశ్వత సభ్యత్వం కోసం భారత్ ప్రయత్నాలకు పెరుగుతున్న మద్దతు
- భారత్‌కు పోర్చుగల్, మారిషస్ దేశాల నుంచి బహిరంగంగా మద్దతు ప్రకటన
- భారత్‌తో కూడిన జీ4 కూటమికి మద్దతు పలికిన మార్షల్ ఐలాండ్స్
- ఆఫ్రికాకు శాశ్వత ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆ దేశాల నుంచి బలమైన డిమాండ్
- సంస్కరణలపై ఏకాభిప్రాయం ఉన్నా వీటో అధికారంపై భిన్నాభిప్రాయాలు

2లో

### రూ.300 దర్శనం టికెట్లు

## వదంతులు నమ్మకండి!



- భారీ డిమాండ్ వల్లే రూ.300 టికెట్ల బుకింగ్‌లో పోటీ అన్న టీటీడీ
- ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ పటిష్ఠంగా పనిచేస్తోందని వెల్లడి
- అందుబాటులో ఉన్న కోటా కన్నా 9 రెట్లు అధికంగా టికెట్లకు డిమాండ్ అని వివరణ
- సోషల్ మీడియాలో అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని

### భక్తులకు విజ్ఞప్తి

శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌పై భక్తుల నుంచి వస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం సుదీర్ఘ వివరణ ఇచ్చింది. ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ సాంకేతికంగా అత్యంత పటిష్ఠంగా ఉందని, అయితే అందుబాటులో ఉన్న టికెట్ల కోటాకు మించి దాదాపు 9 రెట్లు అధికంగా తరువాయి 2లో



### భారత పర్యాటకం జోరు..

## రూ. 2.76 లక్షల కోట్ల ఆదాయం

- భారత పర్యాటక రంగంలో భారీ వృద్ధి నమోదు
- 2025లో 428 కోట్లకు చేరిన దేశీయ పర్యాటకుల సంఖ్య
- విదేశీ పర్యాటకుల రాకతో రూ. 2.76 లక్షల కోట్ల ఆదాయం
- ఈ-వీసా, ఏఐ టెక్నాలజీతో డిజిటల్ టూరిజంకు పెద్దపీట
- దేశ జీడీపీలో 5.22% వాటాతో 8.46 కోట్ల ఉద్యోగాల కల్పన

భారత పర్యాటక రంగం గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలక చోదకశక్తిగా తరువాయి 2లో

### టాటా చెప్పేసిన 'నైరుతి'..

## చివరి రోజుల్లో కాస్త ఊరట

- తెలంగాణలో 15 శాతం లోటుతో ముగిసిన నైరుతి
- చివరి నాలుగు రోజుల వర్షాలతో భారీగా తగ్గిన లోటు
- శనివారం నుంచి రాష్ట్రంలో పెరగనున్న ఉక్కపోత
- భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న గోదావరి వరద
- భారీ వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

2లో



# ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు.. సీఎం సమీక్ష, అలర్ట్ ఆదేశాలు

గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

*** కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి**

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

*** నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు**

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు. గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## లోకేశ్ ట్వీట్..
## అదానీ ఇంధన నిర్వహణ అద్భుతం

అదానీ గ్రూప్ తమ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా రియల్ టైమ్ పద్ధతిలో పర్యవేక్షిస్తున్న తీరును లోకేశ్ పరిశీలించారు. ఈ విధానం వల్ల మెరుగైన పనితీరును సాధించవచ్చని, సత్వర నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని, అలాగే సాంకేతిక అంతరాయాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "భారీ ఇంధన మౌలిక సదుపాయాల నిర్వహణలో సాంకేతికతను, డేటాను వినియోగిస్తున్న విధానం ఎంతో ఆసక్తికరంగా ఉంది. అహ్మదాబాద్ పర్యటనలో ఈ సెంటర్‌ను సందర్శించడం మంచి అనుభవం" అని లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా తనకు ఆతిథ్యం ఇచ్చిన మిత్రుడు కరణ్ అదానీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## నకిలీ ఆధార్‌లకు స్వదేశీ టెక్నాలజీతో చెక్

దేశంలో ఆధార్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా భారత పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. నకిలీ ఆధార్ కార్డులను అత్యంత కచ్చితత్వంతో గుర్తించేందుకు 'భారత్ ఏబీఐఎస్' అనే సరికొత్త ఓపెన్ సోర్స్ బయోమెట్రిక్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. యూఐడీఏఐతో సంబంధం ఉన్న పరిశోధకులు, ఐఐఐటీ హైదరాబాద్, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ నిపుణుల బృందం సంయుక్తంగా ఈ టెక్నాలజీని రూపొందించింది. ఇది దేశవ్యాప్తంగా ఆధార్ డేటాబేస్‌లో డూప్లికేట్ ఎంట్రీలను ఏరివేయడంలో కీలకంగా మారనుంది. 'భారత్ ఏబీఐఎస్' అనేది వేలిముద్రలు, కనుపాప (ఐరిస్), ముఖ కవళికలను కలిపి బయోమెట్రిక్స్‌ను విశ్లేషించే ఒక మల్టీమోడల్ వ్యవస్థ. ఈ మూడు డేటాలను కలిపి ప్రతి వ్యక్తికి కేవలం 13.5 KB పరిమాణంలో ఒక టెంప్లేట్‌ను ఇది సృష్టిస్తుంది. దేశంలోని మొత్తం 155 కోట్ల ఆధార్ ఎంట్రీల నుంచి నమూనాగా సేకరించిన 22 కోట్ల డీఐడెంటిఫైడ్ రికార్డులపై ఈ వ్యవస్థను పరీక్షించారు. ముఖ్యంగా 2 కోట్ల రికార్డుల సబ్‌సెట్‌పై జరిపిన పరీక్షల్లో ఇది అద్భుతమైన ఫలితాలను కనబరిచింది. తప్పుడు గుర్తింపుల రేటు (ఎఫ్‌పీఐఆర్) కేవలం 0.1 శాతంగా, అసలైన వాటిని గుర్తించడంలో వైఫల్యం రేటు (ఎఫ్ఎన్ఐఆర్) 0.05 శాతంగా నమోదైంది. ఈ ఫలితాలు యూఐడీఏఐ నిర్దేశించిన 0.5% ఎఫ్‌పీఐఆర్, 0.1% ఎఫ్ఎన్ఐఆర్ లక్ష్యాల కన్నా చాలా మెరుగ్గా ఉండటం గమనార్హం. ఎఫ్‌పీఐఆర్, ఈ వ్యవస్థ రూపకల్పనలో ఓపెన్ సోర్స్ భాగాలను వినియోగించడం వల్ల ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. డేటా ప్రాసెసింగ్, నాణ్యత అంచనా, ఫేక్ బయోమెట్రిక్స్‌ను గుర్తించడం వంటి పనుల కోసం ఓపెన్ సోర్స్ టూల్స్‌నే వాడారు. భారీ డేటాబేస్‌లో శోధన ప్రక్రియ వేగంగా జరిగేందుకు సర్వర్లపై పనిభారాన్ని సమానంగా పంపిణీ చేసే ఒక ప్రత్యేక షెడ్యూలర్‌ను కూడా ఇందులో పొందుపరిచారు. వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న మూడు ప్రముఖ వ్యవస్థలతో పోల్చినప్పుడు 'భారత్ ఏబీఐఎస్' వాటికి సమానమైన లేదా అంతకంటే మెరుగైన కచ్చితత్వాన్ని చూపించింది. 8 ఎన్విడియా H100 జీపీయూలు, 2 టీబీ ర్యామ్‌తో కూడిన ఒక్క సర్వర్‌పై 4 కోట్ల రికార్డుల గ్యాలరీలో సెకనుకు 100 శోధనలు చేయగల సామర్థ్యం దీనికి ఉంది. దేశంలో డూప్లికేట్ ఆధార్ కార్డులు ఇప్పటికీ ఒక సవాలుగానే ఉన్నాయి. 2022లో ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ దాదాపు 6 లక్షల నకిలీ ఆధార్ కార్డులను గుర్తించి రద్దు చేసినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో 'భారత్ ఏబీఐఎస్' ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోని 'డీప్‌ప్రింట్' ఫింగర్‌ప్రింట్ మోడల్.. వృద్ధులు, చేతివేలిముద్రలు అరిగిపోయిన శ్రామికుల బయోమెట్రిక్ ప్రామాణీకరణ వైఫల్యాలను సగానికి తగ్గించగలదని పరిశోధకులు తెలిపారు. అయితే, ఈ వ్యవస్థ అద్భుతమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ, దేశంలోని పూర్తి ఆధార్ డేటాబేస్‌పై దీనిని ప్రయోగించడానికి ముందు మరిన్ని విస్తృత స్థాయి పరీక్షలు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో 2 కోట్ల లోపు జనాభా ఉన్న దేశాలకు ఇది తక్కువ ఖర్చుతో కూడిన సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడగలదని వారు పేర్కొన్నారు.

## విడుదలైన టెట్ ఫలితాలు.. 70.07% మంది అర్హత

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన టీజీటెట్ ఇన్‌సర్వీస్ టీచర్స్ 2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, టీజీటెట్ ఛైర్‌పర్సన్ శనివారం ఫలితాలను విడుదల చేశారు. జులై 21న విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించారు. మూడు విడతల్లో ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. మొత్తం 24,986 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 22,477 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 15,749 మంది అర్హత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 70.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పేపర్ 1లో 4,942 మంది పరీక్షకు హాజరుకాగా.. 3,398 మంది (68.76%) అర్హత సాధించారు. పేపర్ 2 గణితం, సైన్స్ విభాగంలో 9,131 మంది పరీక్ష రాశారు. వీరిలో 6,720 మంది (73.60%) ఉత్తీర్ణులయ్యారు. పేపర్ 2 సోషల్ స్టడీస్‌లో 8,404 మంది పరీక్షకు హాజరుకాగా.. 5,631 మంది (67%) అర్హత సాధించారు. అభ్యర్థులు తమ ఫలితాలతో పాటు మార్కుల వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సమీపంలోని మీ సేవ కేంద్రాల్లోనూ మార్కుల వివరాలను పొందవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## భద్రతా మండలి శాశ్వత సభ్యత్వం.. భారత్‌కు గ్లోబల్ మద్దతు

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో (UNSC) శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు అంతర్జాతీయ వేదికపై మద్దతు పెరుగుతోంది. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న 81వ సర్వసభ్య సభ (UNGA) సమావేశాల్లో పలు దేశాలు భారత్ వాదనకు అండగా నిలిచాయి. పోర్చుగల్, మారిషస్ దేశాలు నేరుగా భారత్‌కు మద్దతు ప్రకటించగా, మార్షల్ ఐలాండ్స్ జీ4 కూటమికి జై కొట్టింది. భద్రతా మండలిని ప్రస్తుత రాజకీయ వాస్తవాలకు అనుగుణంగా విస్తరించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. సమావేశాల సందర్భంగా పోర్చుగల్ ప్రధాని లూయిస్ మోంటెనెగ్రో మాట్లాడుతూ, భద్రతా మండలిలో ప్రాతినిధ్యం పెరగాలని, ఆఫ్రికా, బ్రెజిల్, భారత్‌లకు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని పిలుపునిచ్చారు. మారిషస్ విదేశాంగ మంత్రి ధనంజయ్ రామ్‌ఫుల్ అత్యంత స్పష్టమైన మద్దతును ప్రకటించారు. "ప్రపంచ వ్యవహారాల్లో భారత్ పోషిస్తున్న నిర్మాణాత్మక పాత్రకు అనుగుణంగా, శాశ్వత సభ్యత్వం కోసం ఆ దేశ అభ్యర్థిత్వాన్ని మేం సమర్థిస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. జీ4, ఎల్69 గ్రూపుల వాదనలకు కూడా తమ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. భారత్, బ్రెజిల్, జర్మనీ, జపాన్‌లతో కూడిన జీ4 కూటమికి కూడా మద్దతు లభించింది. మార్షల్ ఐలాండ్స్ అధ్యక్షురాలు హిల్డా హీన్ మాట్లాడుతూ, "భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం జపాన్, దాని జీ4 భాగస్వాములకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది" అని ప్రకటించారు. దీని ద్వారా ఆమె పరోక్షంగా భారత్‌కు మద్దతు పలికినట్టయింది. ఈ సమావేశాల్లో ఆఫ్రికా దేశాల నుంచి సంస్కరణల కోసం అత్యంత బలమైన గళం వినిపించింది. సియెర్రా లియోన్ అధ్యక్షుడు జూలియస్ మాదా బయో మాట్లాడుతూ, "భద్రతా మండలి ఇప్పటికీ 1945 నాటి ప్రపంచాన్ని ప్రతిబింబిస్తోంది. 160 కోట్లకు పైగా జనాభా ఉన్న ఆఫ్రికాకు ఇప్పటికీ శాశ్వత స్థానం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఘనా అధ్యక్షుడు జాన్ ద్రమానీ మహామ మాట్లాడుతూ, "భద్రతా మండలి సంస్కరణ అనేది ఆఫ్రికాకు చేసే మేలు కాదు.. ఐరాస విశ్వసనీయత, మనుగడకు ఇది అత్యవసరం" అని అన్నారు. అయితే, భద్రతా మండలి సంస్కరణలు జరగాలన్న దానిపై విస్తృత ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ, ఏ దేశాలకు అవకాశం ఇవ్వాలి, ప్రాంతీయ కేటాయింపులు, ముఖ్యంగా వీటో అధికారంపై భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, అమెరికా శాశ్వత సభ్యులుగా ఉన్న ఈ మండలి కూర్పును మార్చాలంటే, సర్వసభ్య సభలో మూడింట రెండొంతుల సభ్యుల ఆమోదంతో పాటు, ఐదు శాశ్వత సభ్య దేశాలు కూడా ఆమోదించాల్సి ఉంటుంది. ఈ కారణాల వల్లే సంస్కరణల ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

## రూ.300 దర్శనం టికెట్లు.. వదంతులు నమ్మకండి!

శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌పై భక్తుల నుంచి వస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం సుదీర్ఘ వివరణ ఇచ్చింది. ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ సాంకేతికంగా అత్యంత పటిష్ఠంగా ఉందని, అయితే అందుబాటులో ఉన్న టికెట్ల కోటాకు మించి దాదాపు 9 రెట్లు అధికంగా డిమాండ్ ఉండటమే సమస్యకు ప్రధాన కారణమని స్పష్టం చేసింది. క్షణాల్లో టికెట్లు అయిపోవడాన్ని వ్యవస్థ వైఫల్యంగా భావించవద్దని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

**గణాంకాలతో వాస్తవ పరిస్థితి వెల్లడి**

టికెట్ల విడుదల సమయంలో వాస్తవంగా ఏం జరుగుతుందో టీటీడీ గణాంకాలతో సహా వివరించింది. దర్శన టికెట్ల బుకింగ్ కోసం ఒకేసారి సుమారు 6 లక్షల మంది యూజర్లు వెబ్‌సైట్‌లోకి వస్తున్నారని తెలిపింది. ఒక్కో యూజర్ సగటున తమ కుటుంబ సభ్యుల కోసం నాలుగు టికెట్లకు ప్రయత్నించినా, మొత్తం డిమాండ్ సుమారు 24 లక్షల టికెట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. అయితే, టీటీడీ విడుదల చేసే కోటా కేవలం 2.69 లక్షల టికెట్లు మాత్రమే. అంటే, అందుబాటులో ఉన్న ప్రతి టికెట్‌కు సగటున 9 మంది పోటీ పడుతున్నారని, ఈ తీవ్రమైన పోటీ కారణంగానే చాలా మందికి టికెట్లు లభించడం లేదని పేర్కొంది.

**వర్చువల్ క్యూ భద్రతకే, అడ్డంకి కాదు**

బుకింగ్ సమయంలో భక్తులను కొంతసేపు నిరీక్షించేలా చేసే 'వర్చువల్ క్యూ' విధానంపై కూడా టీటీడీ స్పష్టత ఇచ్చింది. ఇది టికెట్లను నిరాకరించడానికి కాదని, ఒకేసారి లక్షలాది అభ్యర్థనలు వచ్చి సర్వర్లపై భారం పడకుండా, మొత్తం వ్యవస్థ స్థిరత్వాన్ని కాపాడేందుకు ఏర్పాటు చేసిన సాంకేతిక విధానమని తెలిపింది. గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్, ఆటో స్కేలింగ్, లోడ్ బ్యాలెన్సింగ్ వంటి ఆధునిక టెక్నాలజీతో ఆన్‌లైన్ వ్యవస్థను నిర్వహిస్తున్నామని, ప్రత్యేక టెక్నికల్ వార్‌రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించింది. అదేవిధంగా, పేమెంట్ విఫలమవడం పూర్తిగా టీటీడీ పరిధిలోని అంశం కాదని, ఇది పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకులు, యూపీఐ నెట్‌వర్క్‌ల పనితీరుపై కూడా ఆధారపడి ఉంటుందని గుర్తుచేసింది. టికెట్లు అందుబాటులో లేకపోవడం వల్ల వచ్చే 'స్లాట్ అన్‌అవైలబుల్' సందేశాన్ని సాంకేతిక లోపంగా పరిగణించరాదని కోరింది. శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వంటి ఇతర ఆలయాల బుకింగ్ ప్రక్రియ ఇదే వ్యవస్థ ద్వారా సజావుగా సాగుతోందని, అక్కడ డిమాండ్ తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని ఉదహరించింది. భక్తుల ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని, యాంటీబాట్ మెకానిజమ్స్, సెక్యూరిటీ, పేమెంట్ ప్రక్రియలను నిరంతరం మెరుగుపరుస్తున్నామని టీటీడీ హామీ ఇచ్చింది. భారీ డిమాండ్ ఉన్నప్పుడు ప్రతి ఒక్కరికీ టికెట్ లభించడం సాధ్యం కాదని, ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని కోరింది. టీటీడీపై సోషల్ మీడియాలో జరిగే అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, భక్తులకు పారదర్శకమైన, సురక్షితమైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## భారత పర్యాటకం జోరు.. రూ. 2.76 లక్షల కోట్ల ఆదాయం

భారత పర్యాటక రంగం గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలక చోదకశక్తిగా మారుతోంది. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం జరగనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2025 సంవత్సరంలో దేశీయ పర్యాటకుల సంఖ్య ఏకంగా 428.55 కోట్లకు చేరుకోగా, విదేశీ పర్యాటకుల సంఖ్య 2.53 కోట్లకు పెరిగింది. దీని ద్వారా దేశానికి రూ. 2,76,831 కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభించింది. 202324 ఆర్థిక సంవత్సరంలో పర్యాటక రంగం దేశ జీడీపీకి 5.22% వాటాను అందించడంతో పాటు, ప్రత్యక్షంగా, పరోక్షంగా 8.46 కోట్ల మందికి ఉపాధి అవకాశాలను కల్పించిందని ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా కూడా పర్యాటక రంగం 2024లో గ్లోబల్ జీడీపీలో 10% వాటాను (10.9 ట్రిలియన్ డాలర్లు) కలిగి ఉండటం గమనార్హం. ఈ ఏడాది 'డిజిటల్ ఎజెండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' థీమ్‌తో పర్యాటక దినోత్సవం జరగనుండగా, ఆ దిశగా భారత్ ఇప్పటికే కీలక అడుగులు వేస్తోంది. ఈవీసా, 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' డిజిటల్ ప్లాట్‌ఫామ్, నిధి+ (NIDHI+) వంటి కార్యక్రమాలతో డిజిటల్ టూరిజం వ్యవస్థను బలోపేతం చేస్తోంది. ముఖ్యంగా 2014లో 43 దేశాలతో ప్రారంభమైన ఈవీసా సౌకర్యం ఇప్పుడు 172 దేశాల పౌరులకు అందుబాటులోకి వచ్చింది. దేశంలోని 37 విమానాశ్రయాలు, 38 ఓడరేవులు సహా మొత్తం 88 అంతర్జాతీయ పోర్టుల ద్వారా ప్రవేశానికి అనుమతి ఇస్తున్నారు. ప్రస్తుతం భారత్ జారీ చేస్తున్న మొత్తం వీసాలలో 78% ఈవీసాలే ఉండటం, 95% దరఖాస్తులను 72 గంటల్లోనే ప్రాసెస్ చేస్తుండటంతో విదేశీ పర్యాటకులకు ప్రయాణం సులభతరమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' ప్లాట్‌ఫామ్ ద్వారా పర్యాటకులకు వర్చువల్ అనుభూతిని అందిస్తున్నారు. దీని సహాయంతో రియల్‌టైమ్ వాతావరణ సమాచారం, నగరాల విశేషాలు, ఇతర ప్రయాణ సేవలను వ్యక్తిగతంగా అందించడం సాధ్యమవుతోంది. వీటితో పాటు స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్, క్రూయిజ్ టూరిజం వంటి పథకాల ద్వారా కొత్త పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ స్థానికులకు జీవనోపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నారు. దేశంలో పర్యాటక రంగం ఆర్థిక ప్రభావాన్ని 'టూరిజం శాటిలైట్ అకౌంట్' (టీఎస్ఏ) ద్వారా అధికారికంగా లెక్కిస్తున్నారు.

## టాటా చెప్పేసిన 'నైరుతి'.. చివరి రోజుల్లో కాస్త ఊరట

తెలంగాణలో నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసింది. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు నిరాశే మిగిల్చినా, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం చివరి రోజుల్లో ఆదుకుంది. గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురిసిన విస్తారమైన వర్షాల కారణంగా వర్షపాతం లోటు గణనీయంగా తగ్గింది. సీజన్ మొత్తం మీద 20 శాతంగా ఉన్న లోటు, ఈ వర్షాలతో 15 శాతానికి పరిమితమైంది. సెప్టెంబర్ 22వ తేదీ వరకు రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం నమోదైంది. అయితే గత నాలుగు రోజుల్లో కురిసిన భారీ వర్షాలతో ఈ నెల లోటు కేవలం 4 శాతానికి పడిపోయింది. ఈ కొద్దిరోజుల్లోనే సగటున 52 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావడం విశేషం. ఈ వర్షాలకు ముందు 18 జిల్లాల్లో లోటు వర్షపాతం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 14కు తగ్గింది. అయితే, ఏ జిల్లాలోనూ అధిక వర్షపాతం నమోదు కాలేదు. మరోవైపు, భారీ వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రానికి 20.2 అడుగులకు చేరిన ప్రవాహం, నేడు (శనివారం) నాటికి 30 అడుగులకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాద్రి జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ అప్రమత్తం చేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో వర్షపు నీరు గనుల్లోకి చేరడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. వాయుగుండం ప్రభావం ముగియడంతో శనివారం నుంచి రాష్ట్రంలో ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. రేపటి (ఆదివారం) నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా వేడి వాతావరణం ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## సంపాదకీయం

# ఎన్నికల కమిషన్ ఎవరికి జవాబుదారీ?

ప్రజాస్వామ్యంలో ఓటర్లు పాలకులను ఎన్నుకుంటారు. కానీ ప్రస్తుతం పాలకులే ఓటర్లను ఎన్నుకుంటున్నారు అని ఈ మధ్య తరచుగా వింటున్నాము. అలాంటి మాటలు ఎందుకు వినవలసి వస్తుందో పాలకులకు తెలుసు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ప్రక్రియలో ఎన్నికల కమిషన్ ఎలా పనిచేస్తున్నదో ప్రపంచం గమనిస్తున్నా పెద్దగా బాధపడటం లేదు. కానీ ఎన్నికల కమిషన్ లో ఉన్న ఇద్దరు కమిషనర్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ పట్ల తమ అసంతృప్తిని వెలిబుచ్చగానే భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామ్యం అంటే ఏమిటో ఇప్పుడు ప్రవచిస్తున్నది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పైన మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అసంతృప్తిని వెలిబుచ్చిన విషయం బయటపడగానే, "ప్రజాస్వామ్యంలో ఎవరి అభిప్రాయం వాళ్ళు వెలిబుచ్చుతారు" అని సూత్రాలు చెబుతున్నారు. అయితే ఈ ప్రజాస్వామ్యం ఎన్నికల కమిషనర్లకేనా లేక ప్రతిపక్షాలకు కూడా ఉంటుందా అనేది ప్రశ్నార్థకం. ప్రభుత్వాన్ని నిలదీస్తే దేశ సమగ్రతను నిలదీసినట్లు ఎదురుదాడి చేయకుండా ఉంటారా అని ప్రశ్నిస్తున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశంలో జరిగే ఎన్నికల ప్రక్రియ అంటే సాధారణ విషయం కాదు. ప్రపంచ జనాభాలో 18 శాతం జనాభాను పాలించే పాలకులను ఎన్నుకునే ప్రక్రియ. ఆ ప్రక్రియను ఒక్కరు రూపొందిస్తారా, ముగ్గురు రూపొందిస్తారా అనేది నిర్ణయించేది కేంద్ర ప్రభుత్వం. ఆ కేంద్ర ప్రభుత్వం ఒక్కటే నియమించే ఎన్నికల కమిషనర్లు, ఆ కేంద్ర ప్రభుత్వానికే వ్యతిరేకంగా ఎలా ప్రవర్తిస్తారు అనే సందేహం ఎవరికైనా వస్తుంది. ఆ నియామకాలు ఏదో సీనియారిటీ ప్రకారం వచ్చేవి కావు. దేశంలో అన్నీ స్వతంత్ర వ్యవస్థలే—సీబీఐ, ఈడీ, ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థ: అన్నీ సర్వ స్వతంత్ర సంస్థలే. ఇందులో న్యాయవ్యవస్థను మినహాయిస్తే మిగిలిన అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించాయి కేంద్రంలో అధికారం చెలాయించిన పార్టీలు. దేశంలో ఉన్న చట్టాల ప్రకారం ఈడీకి, సీబీఐకి ఒకదానికొకటి సంబంధం లేదు. ఈడీకి, సీబీఐకి ఎన్నికల కమిషన్ తో ఎటువంటి సంబంధం లేదు. కానీ ఎక్కడైనా సీబీఐ ప్రవేశించగానే ఈడీ వస్తుంది. ఇవి రెండూ కలిసి ఆ రాష్ట్రంలో ఎవరి అవినీతిని ప్రక్షాళన చేయాలనుకుంటాయో వారిని అతలాకుతలం చేసిన తరువాత ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహిస్తుంది. ఈ మధ్య ఎన్నికల కమిషన్ కూడా ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేస్తున్నది. ఇన్ని వ్యవస్థలు ప్రక్షాళన చేసిన తరువాత ఆ రాష్ట్రాలు డబుల్ ఇంజిన్ సర్కార్ ఆధ్వర్యంలో దూసుకుపోతాయి. ఇందిరా గాంధీ హయాం నుండి ఈ సర్వ స్వతంత్ర సంస్థలు కేంద్రం చేతిలో బందీలుగానే కనిపిస్తున్నాయి తప్ప, ప్రజలకు భరోసా ఇస్తాయి అనే నమ్మకాన్ని ఎప్పుడూ కల్పించలేదు. ఇక ఎన్నికల కమిషన్ అనేది ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి ప్రణాళికలు రచించడం మానేసి, పౌరసత్వాన్ని నిర్ణయించే కమిషన్ గా మారిపోయింది. ఇద్దరు కమిషనర్లు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ను నిలవరించాలని అనుకున్నప్పుడు, సీఈసీ నిర్ణయానికి మిగిలిన ఇద్దరు కమిషనర్లు వ్యతిరేకత తెలిపితే మెజారిటీ నిర్ణయమే నెగ్గుతుంది కదా అని చాలా సులభంగా పరిష్కారం చెబుతున్నారు మద్దతుదారులు. కొన్ని విషయాలు చర్చకు రాకుండానే బయటకు వస్తుంటే అభ్యంతరం ఎక్కడ తెలపాలి? విషయం బయటకు రాగానే ప్రభుత్వం చేసే ఎదురుదాడి చూస్తుంటే అనేక విషయాలు కప్పిపుచ్చే ప్రయత్నం కనిపిస్తున్నది. ఇద్దరు బాధ్యతాయుతమైన అధికారులు ఒకరి గురించి ఫిర్యాదు చేస్తే వారిద్దరినీ టార్గెట్ చేస్తూ వాళ్ల ఆఫీసు పనితీరు గురించి, అక్కడ పనిచేసే కింది ఉద్యోగుల పొరపాట్లుగా చిత్రీకరించే ప్రయత్నం ప్రభుత్వం చేయటం ఎందుకో అర్థం కాదు. ప్రజాస్వామ్యం బలంగా ఉండబట్టే ఎవరైనా అభ్యంతరాలు లేవనెత్తగలుగుతున్నారు అని సగర్వంగా చెప్పుకునే వారు, వారు లేవనెత్తిన అంశాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటి విషయాలు అనేది గమనించుకోవాలి అనే స్పృహ లేకుండా పోతున్నారు. ఈ మధ్యకాలంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన సవరణ ప్రక్రియ వివాదాస్పదం అవుతున్నది. ఇద్దరు కమిషనర్లు లేవనెత్తిన అంశాలు ప్రతిపక్షాలు ఎప్పటి నుండో ఆందోళన వ్యక్తపరుస్తున్న విషయాలు వాస్తవమేనని తేటతెల్లం చేస్తున్నాయి. ఎన్నికల సంఘం కొత్తగా ప్రవేశపెట్టిన 'ఈసీఐ నెట్' ద్వారా ఓటర్ల సవరణ అధికారాలు క్షేత్రస్థాయి అధికారుల పరిధి నుండి తీసేసి, ఢిల్లీలోని ఐటీ విభాగానికి జతచేసే ప్రయత్నం జరుగుతున్నది అని ఇద్దరు కమిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటరు నమోదు ప్రక్రియ కోసం ఉద్దేశించిన ఫారమ్-6 లో చేసిన సవరణలకు చట్టబద్ధత లేదనేది వారు ఒప్పుకుంటున్న విషయం. ఇటువంటి వాటిపైన ప్రజల నుండి ఎటువంటి అప్పీళ్లు రాలేదు అనగానే, ప్రజలకు ఎటువంటి అభ్యంతరాలు లేవు అని ప్రభుత్వం చెబుతున్నది. సొంతంగా ఫారమ్-6 నింపగలిగే అక్షరాస్యత దేశంలో మూడొంతుల మందికి లేదు. అటువంటిది తమ ఓటును అక్రమంగా తీసేశారు అని సంబంధిత అధికారి చుట్టూ తిరిగే శక్తి ఎక్కడి నుండి వస్తుంది? రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీల కార్యకర్తలకు తమ పార్టీ వారి ఓట్లను తొలగించినా, కొత్తగా నమోదు చేయాలన్నా పనులు కావటం లేదు. పట్టణాల మాట ఎలా ఉన్నా పల్లెల్లో ఓటు వేయటాన్ని తమ ఆత్మగౌరవంగా భావిస్తారు. ఓటర్ల జాబితాలో తమ పేరు లేకుంటే అవమానంగా భావిస్తారు. కానీ ఇప్పుడు పల్లెల్లో కూడా నిర్లిప్తత వచ్చేసింది. దీని ప్రభావం దక్షిణాది రాష్ట్రాలలో కంటే మిగిలిన రాష్ట్రాలలో ఎక్కువగా కనిపిస్తున్నది. భారత ఎన్నికల సంఘం ఇటువంటి పరిస్థితిని ఎందుకు కల్పిస్తున్నది అనే దానికి జవాబు ప్రకటనలతో రాదు. మరి ప్రజలు భారత ఎన్నికల సంఘం పైన నమ్మకం ఉంచాలి అంటే ప్రభుత్వ జోక్యం లేని ఎన్నికల సంఘం రావాలి. భారత ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థ అయినంత మాత్రాన ప్రజలకు జవాబుదారీ వ్యవస్థ కాకుండా పోతుందా? ప్రజల విశ్వాసం చూరగొనే అవసరం ఉండదా? ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన కథనం భారత ఎన్నికల సంఘం పనితీరులోని పారదర్శకతనే ప్రశ్నిస్తున్నది. కానీ మన ప్రభుత్వం మాత్రం జ్ఞానేష్ కుమార్‌ను ట్రంప్ ప్రశంసించారు అని చప్పట్లు కొడుతున్నది. అదే దృష్టితో వెరైటీస్ ఆఫ్ డెమోక్రసీ (V-Dem) సంస్థ తమ గ్లోబల్ డెమోక్రసీ నివేదికల్లో భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ గురించి ఏమంటున్నదో చూడాలి. ఆ సంస్థ తన నివేదికల్లో భారతదేశాన్ని 'ఎలక్టోరల్ ఆటోక్రసీ'—అంటే ఎన్నికల ప్రజాస్వామ్య నియంతృత్వంగా అభివర్ణించింది. ప్రతిపక్ష నాయకులపై దర్యాప్తు సంస్థల ఒత్తిడి, మీడియాపై ఆంక్షలు, ఎన్నికల నిధుల విషయంలో ఉన్న అస్పష్టత వలన ఎన్నికల పోటీ సమానంగా లేదని పేర్కొన్నది. ఫ్రీడమ్ హౌస్ (యూఎస్) వారి నివేదిక భారత హోదాను 'పూర్తి స్వేచ్ఛ' నుండి 'పాక్షిక స్వేచ్ఛ'కు తగ్గించింది. ఎన్నికల సంఘం నియామకాల విధానం వలన ఎన్నికల సంఘం యొక్క స్వతంత్రత తగ్గింది అని స్పష్టంగా చెబుతున్నది. అధికార పార్టీలకు వచ్చే నిధులు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నది. ఎకనామిక్ ఇంటెలిజెన్స్ యూనిట్ వారు తమ డెమోక్రసీ ఇండెక్స్‌లో భారత్‌ను 'లోపభూయిష్టమైన ప్రజాస్వామ్యం'గా పేర్కొన్నారు. అయితే కోట్లమంది ఓటర్లు పాల్గొనే సురక్షితమైన ఓటింగ్ ప్రక్రియ భారత్‌లో మాత్రమే సాధ్యమని చెబుతూ, పాశ్చాత్య పరిశోధనా సంస్థల కొలమానాలు పక్షపాతంతో కూడుకున్నవని కేంద్రం వారి నివేదికలను కొట్టిపారేసింది. అదే నిజమైతే భారతీయులుగా మనం గర్వపడవచ్చు. విదేశీ సంస్థలు మన ప్రజాస్వామ్యాన్ని వేలెత్తి చూపడం మనకు గర్వకారణంగా ఏ భారతీయుడూ భావించడు. కానీ స్వదేశంలో అదే ఎన్నికల సంఘంలో ఉన్న ఇద్దరు కమిషనర్లు చేసే ఆరోపణలపైన పారదర్శకమైన విచారణ జరిపి, ఖచ్చితమైన సమాధానం రాబట్టి ప్రజలకు నమ్మకం కల్పిస్తే, పౌరులు కూడా విదేశీ సంస్థలు చేసే విమర్శలకు గట్టి సమాధానం చెప్పగలుగుతారు. అలా జరగాలంటే భారత ఎన్నికల సంఘం ప్రభుత్వం కోసం కాకుండా, ప్రజల పట్ల పూర్తి జవాబుదారీతనంతో పనిచేయాలి.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 27

SEP 27

* 1833: భారతీయ సంఘసంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ మరణం (జ.1772).
* 1915: నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జననం (మ.2012). (చిత్రంలో)
* 1933: దక్షిణ భారతదేశానికి చెందిన హాస్య, రంగస్థల నటుడు నగేష్ జననం (మ.2009).
* 1953: హిందూ ఆధ్యాత్మిక గురువు మాతా అమృతానందమయి జననం.
* 1980: ప్రపంచ పర్యాటక దినోత్సవం.
* 1981: న్యూజిలాండ్ కు చెందిన అంతర్జాతీయ క్రికెటర్ బ్రెండన్ మెక్‌కలమ్ జననం.
* 1997: గాంధేయవాది, మాజీ రాష్ట్రమంత్రి మండలి వెంకటకృష్ణారావు మరణం (జ.1926).
* 2001: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి మరణం (జ.1920).
* 2008: భారతీయ నేపథ్య గాయకుడు మహేంద్ర కపూర్ మరణం (జ.1934).


కొండా లక్ష్మణ్ బాపూజీ



### మారిషస్ స్టేట్ హౌస్‌లో (రాష్ట్రపతి భవన్)
## డా. గజల్ శ్రీనివాస్ సందేశం - గానం

* **ప్రపంచ శాంతి, సుహృద్భావం, మానవతా విలువలను గజల్ గానంతో చాటిన గజల్ శ్రీనివాస్**



పోర్ట్ లూయిస్, మారిషస్: ప్రఖ్యాత గజల్ గాయకుడు, ట్రిపుల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత డా. గజల్ శ్రీనివాస్ ఇటీవల మారిషస్ పర్యాటనలో భాగంగా మారిషస్ రాష్ట్రపతి శ్రీ ధరమ్‌బీర్ గోకుల్ ఆహ్వానం మేరకు ఆ దేశ స్టేట్ హౌస్ (రాష్ట్రపతి భవన్) ను సందర్శించారు. ఈ సందర్భంగా డా. గజల్ శ్రీనివాస్‌తో పాటు మారిషస్‌లోని ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రతినిధులను రాష్ట్రపతి సాదరంగా ఆహ్వానించారు. 2027 ఏప్రిల్‌లో మారిషస్‌లో నిర్వహించనున్న 5వ ప్రపంచ తెలుగు మహాసభల ఏర్పాట్లు, లక్ష్యాలు, కార్యక్రమాల గురించి రాష్ట్రపతి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో స్టేట్ హౌస్ సందర్శనకు వచ్చిన సీనియర్ సిటిజన్స్ బృందాన్ని రాష్ట్రపతి శ్రీ ధరమ్‌బీర్ గోకుల్ స్వయంగా డా. గజల్ శ్రీనివాస్‌కు పరిచయం చేసి, వారికి సందేశం అందించవలసిందిగా కోరారు. రాష్ట్రపతి అభ్యర్థన మేరకు డా. గజల్ శ్రీనివాస్ సీనియర్ సిటిజన్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ, తన గజల్ గానం ద్వారా ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వం, సుహృద్భావం, మానవతా విలువలు, దేశాల మధ్య స్నేహ సంబంధాలు అనే సందేశాలను హృద్యంగా వినిపించారు. తెలుగు గజల్స్ లోని భావాలను వారికి వివరించి ఆలపించగా, అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మారిషస్ రాష్ట్రపతి శ్రీ ధరమ్‌బీర్ గోకుల్ మాట్లాడుతూ డా. గజల్ శ్రీనివాస్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని అభినందించారు. ప్రపంచ శాంతి కోసం, వివిధ దేశాలు-ప్రజల మధ్య సుహృద్భావాన్ని పెంపొందించేందుకు ఆయన తన గజల్ గానం, శాంతి యాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అలాగే శ్రీమద్భగవద్గీత ప్రచారం ద్వారా చేస్తున్న సేవలను ప్రశంసించారు. రాష్ట్రపతి శ్రీ ధరమ్‌బీర్ గోకుల్‌తో పాటు ఆయన సతీమణి శ్రీమతి బృందా గోకుల్ కూడా డా. గజల్ శ్రీనివాస్ చేస్తున్న విశ్వశాంతి, సాంస్కృతిక సేవలను అభినందించారు. అనంతరం స్టేట్ హౌస్‌లో రాష్ట్రపతి శ్రీ ధరమ్‌బీర్ గోకుల్ డా. గజల్ శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

### విజయవాడలో దశాబ్దాల సమస్యకు పరిష్కారం..
## 30న సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీ



అమరావతి: విజయవాడ లో దశాబ్దాల ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ పేదల సొంతింటి కలకు సంపూర్ణ భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. విశాఖలో 28,445 కుటుంబాలకు పట్టాలిచ్చిన తరహాలోనే.. ఈనెల 30న విజయవాడలో మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. 24,057 కుటుంబాలకు రూ.9,800 కోట్ల విలువైన భూమిపై క్రమబద్ధీకరణ పట్టాలను ముఖ్యమంత్రి చంద్రబాబు అందించనున్నారు. ఎన్టీఆర్ హయాంలో ఇచ్చిన పట్టాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ.. పేదల ఆస్తులకు శాశ్వత భద్రత కల్పించనున్నారు. ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల ద్వారా ఒక్కో కుటుంబానికి సుమారు రూ.40లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ప్రయోజనం చేకూరనుంది. తమ ఇళ్లకు శాశ్వత హక్కులు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్న నివాసితుల కల సాకారం కానుంది. ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోనూ పట్టాల పంపిణీ జరగనుంది. మొత్తం 15 మండలాల్లోని 617 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పించనున్నారు.

# ఆసియా క్రీడల కబడ్డీలో భారత్ గోల్డెన్ డబుల్.. చంద్రబాబు, లోకేశ్ అభినందనలు

- **ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లకు డబుల్ గోల్డ్**
- **పురుషుల, మహిళల ఫైనల్స్‌లో ఇరాన్‌పై ఘన విజయం**
- **విజేతలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్**
- **ఇది కబడ్డీ స్టైల్ 'డుబ్కీ' అంటూ చంద్రబాబు ప్రశంస**
- **బలం, నైపుణ్యం, పోరాట స్ఫూర్తి అద్భుతమన్న నారా లోకేశ్**



ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో అద్భుత ప్రదర్శన చేశాయి. ఈ చారిత్రాత్మక విజయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేస్తూ జట్లకు అభినందనలు తెలిపారు. కబడ్డీలో భారత ఆధిపత్యం మరోసారి రుజువైందని వారు కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందిస్తూ, "కబడ్డీలో భారత ఆధిపత్యం డబుల్ గోల్డ్‌తో కొనసాగింది. మన మహిళల జట్టు తమ టైటిల్‌ను నిలబెట్టుకోగా, పురుషుల జట్టు కూడా ఐచి నగోయాలో ఉత్కంఠభరిత విజయంతో మరో స్వర్ణాన్ని భారత్ ఖాతాలో చేర్చింది. ప్రపంచానికి సరైన కబడ్డీ స్టైల్ 'డుబ్కీ'ని రుచి చూపించారు. ఈ అద్భుత విజయం సాధించిన మన కబడ్డీ జట్టుకు నా అభినందనలు. మీ అందరినీ చూసి భారత్ గర్విస్తోంది" అని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సైతం భారత జట్లను ప్రశంసించారు. "భారత్‌కు డబుల్ గోల్డ్! ఆసియా గేమ్స్ ఛాంపియన్‌లుగా నిలిచిన మన పురుషుల, మహిళల కబడ్డీ జట్లకు హృదయపూర్వక అభినందనలు. రెండు జట్లు కూడా బలం, నైపుణ్యం, పోరాట స్ఫూర్తిని అద్భుతంగా ప్రదర్శించాయి. మీరు దేశం మొత్తం గర్వపడేలా చేశారు. జై హింద్!" అని లోకేశ్ తన సందేశంలో తెలిపారు. శనివారం జరిగిన ఫైనల్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌పైనే విజయం సాధించడం విశేషం. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లలో భారత క్రీడాకారులు అద్వితీయమైన ప్రతిభ కనబరిచి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ విజయాలతో కబడ్డీ క్రీడలో తమకు తిరుగులేదని భారత్ మరోసారి ప్రపంచానికి చాటి చెప్పింది.

## హిందువులంటే జగన్‌కు గిట్టదు.. అందుకే ఆ విధంగా ప్రచారం: సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి

- **ప్రకాశం జిల్లాలో వైఎస్సార్ విగ్రహం ఘటనపై దీపక్ రెడ్డి ఆగ్రహం**
- **హిందువులంటే జగన్‌కు పడదనేందుకే ఈ ఘటనే నిదర్శనమని వ్యాఖ్యలు**
- **శుభసూచకమైన పసుపు రంగు అంటే వైసీపీకి గిట్టదని విమర్శ**
- **గతంలో 300 ఆలయాలపై దాడులు జరిగాయన్న దీపక్ రెడ్డి**
- **వైసీపీ తీరు మార్చుకోకపోతే మనుగడ కష్టమని హెచ్చరిక**



వైసీపీ అధినేత జగన్‌కు హిందువులన్నా, హిందూ సంప్రదాయాలన్నా గిట్టదని, అందుకే ప్రకాశం జిల్లాలో వైఎస్సార్ విగ్రహంపై పసుపు రంగు పడిందంటూ ఫేక్ ప్రచారం చేస్తున్నారని సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రకాశం జిల్లా ఉమామహేశ్వరపురంలో వైఎస్సార్ విగ్రహంపై పసుపు పడిందనే నెపంతో, ఒక టీడీపీ నాయకుడిని బెదిరించి, బలవంతంగా విగ్రహాన్ని నీటితో కడిగించి, దాన్ని వీడియో తీసి వైసీపీ నేతలు రాక్షసానందం పొందారని ఆయన మండిపడ్డారు. "హిందువులు శుభకార్యాలకు ప్రతీకగా భావించే పసుపు రంగు అంటే వైసీపీ నాయకులకు ఎందుకంత కోపం? విగ్రహంపై పసుపు పడితే, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి గానీ, దారికాచి ఒక వ్యక్తిని బెదిరించి ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణం. ఇది కేవలం ఒక టీడీపీ నాయకుడిపై జరిగిన దాడి కాదు, యావత్ హిందూ సమాజంపై జరిగిన దాడిగా పరిగణించాలి" అని దీపక్ రెడ్డి వ్యాఖ్యానించారు. వైసీపీ నేతల ఇలాంటి దౌర్జన్యపూరిత ప్రవర్తనను చూసే 2024 ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఘోరంగా ఓడించారని, అయినా వారిలో మార్పు రాలేదని విమర్శించారు. భవిష్యత్తులోనూ ఇదే వైఖరి కొనసాగిస్తే పార్టీ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించారు.

*** వైసీపీ హయాంలో ఆలయాలపై దాడులు**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే అనేక సంఘటనలు జరిగాయని దీపక్ రెడ్డి గుర్తుచేశారు. "శ్రీశైలం నుంచి రామతీర్థం వరకు దాదాపు 300 దేవాలయాలపై దాడులు జరిగాయి. అంతర్వేది రథం దగ్ధం నుంచి రామతీర్థంలో రాముడి విగ్రహ శిరస్సు ఖండన వరకు ఎన్నో దుశ్చర్యలకు పాల్పడ్డారు. అయినా బాధ్యులైన ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. అప్పటి మంత్రి కొడాలి నాని సైతం విగ్రహాల ధ్వంసంపై బాధ్యతారహితంగా మాట్లాడారు" అని దుయ్యబట్టారు. తిరుమల పవిత్రతను సైతం మంటగలిపారని దీపక్ రెడ్డి ఆరోపించారు. బస్సు టికెట్ల వెనుక అన్యమత ప్రచార వాక్యాలు, టీటీడీ వెబ్‌సైట్‌లో అశ్లీల చిత్రాలు, అధిక ధరలతో భక్తులను దేవుడికి దూరం చేసే కుట్ర చేశారని విమర్శించారు. పరకామణిలో జరిగిన దొంగతనాన్ని జగన్ చిన్నదిగా అభివర్ణించడం, వైవీ సుబ్బారెడ్డి భార్య ఆధ్వర్యంలో 'జగన్మోహక రక్షక' అంటూ అన్యమత ప్రార్థనలు చేయించడం వంటి ఘటనలు హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని అన్నారు. వైసీపీ నేతలు ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్.. 95 కంపెనీలకు నోటీసులు

- **ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు**
- **సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు**
- **పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ**
- **వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం**



సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది. నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

## తగ్గిన టీడీపీ విరాళాలు.. అధికారంలోకి వచ్చాక ఆసక్తికర పరిణామం!

- **2025-26 ఆర్థిక సంవత్సరంలో టీడీపీకి రూ.58.25 కోట్ల విరాళాలు**
- **గత రెండేళ్లతో పోలిస్తే గణనీయంగా తగ్గిన విరాళాల మొత్తం**
- **ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి అత్యధికంగా రూ.45 కోట్ల విరాళం**
- **విరాళాలను కార్యకర్తల సంక్షేమం కోసమే వినియోగిస్తామని వెల్లడి**
- **మహానాడు వేదికగా మరో రూ.25 కోట్లకు పైగా నిధుల సేకరణ**



ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీకి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను విరాళాలు అందాయి. ఈ ఏడాది పార్టీకి మొత్తం రూ.58.25 కోట్ల నిధులు సమకూరినట్లు టీడీపీ ప్రధాన కార్యదర్శి పి. అశోక్‌బాబు కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలో వెల్లడించారు. అయితే, గత రెండేళ్లతో పోలిస్తే విరాళాల మొత్తం తగ్గడం గమనార్హం.

**ప్రధాన దాతలు వీరే..**

టీడీపీకి అందిన మొత్తం విరాళాల్లో సింహభాగం ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచే వచ్చింది. ఈ ట్రస్ట్ ఆరు వేర్వేరు విడతల్లో మొత్తం రూ.45 కోట్లు విరాళంగా అందించింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్ కేంద్రంగా పనిచేస్తున్న వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.5 కోట్లు ఇవ్వగా, ఎంపీ సానా సతీశ్‌బాబు రూ.1.16 కోట్లు విరాళమిచ్చారు. వీరితో పాటు హైదరాబాద్ బండ్లగూడ జాగీర్‌కు చెందిన సీఎన్ఏపీఎస్ ఇంటెలిక్యాడ్ ప్రైవేట్ లిమిటెడ్, కర్నూలుకు చెందిన శ్రీరాయలసీమ హైస్ట్రెంత్ హైపో లిమిటెడ్ సంస్థలు చెరో కోటి రూపాయలు విరాళంగా అందజేశాయి.

**తగ్గుతున్న విరాళాల సరళి..**

గత గణాంకాలతో పోలిస్తే టీడీపీకి అందుతున్న విరాళాలు తగ్గుముఖం పట్టాయి. 2023-24లో పార్టీకి రూ.100 కోట్లు రాగా, 2024-25లో రూ.83 కోట్లు వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) అది రూ.58.25 కోట్లకు తగ్గింది. 2023-24తో పోలిస్తే దాదాపు సగానికి సగం, 2024-25తో పోలిస్తే రూ.25 కోట్ల మేర విరాళాలు తగ్గాయి. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విరాళాలు తగ్గడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కాగా, ఈ ఏడాది నిర్వహించిన మహానాడు వేదికగా రెండు రోజుల్లో పార్టీకి రూ.25.61 కోట్ల విరాళాలు అందాయి. ఇందులో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు రూ.5 కోట్లు అందించారు.

**కార్యకర్తల సంక్షేమం కోసమే..**

పార్టీకి విరాళాల రూపంలో వచ్చే నిధులను పూర్తిగా కార్యకర్తల సంక్షేమం కోసమే వినియోగిస్తున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీలో రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారి పిల్లల చదువుల కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య, ఉపాధి అవకాశాలకు చేయూత అందిస్తున్నారు.

## మద్యం షాపులకు అక్టోబరు 5న డ్రా: మంత్రి కొల్లు రవీంద్ర



విశాఖపట్నం: ఆధార్ కార్డు ఉంటే చాలు.. ఎవరైనా మద్యం షాపు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. అక్టోబరు 5న డ్రా తీసి దుకాణాలు కేటాయిస్తామన్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా.. డిస్టలరీల నుంచి మద్యం షాపు వరకు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. "ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా మద్యం బాటిల్‌ను స్కాన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. కొందరు వ్యక్తులు కల్తీ మద్యం తయారు చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలని చూస్తే కఠిన చర్యలు తీసుకున్నాం. వైకాపా హయాంలో మద్యం పాలసీ పూర్తిగా అవినీతిమయం చేశారు. మద్యం రవాణాలో కూడా అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు దోచుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 80శాతం కొత్త బ్రాండ్‌లు తీసుకొచ్చాం. ఆల్కహాల్ తక్కువగా ఉండే మద్యాన్ని ప్రమోట్ చేయాలని సీఎం సూచించారు. దానిపై ప్రత్యేక దృష్టి సారించాం'' అని కొల్లు రవీంద్ర తెలిపారు.

## అమరావతిలో గ్రామకంఠం భూములపై సీఆర్‌డీఏ స్పష్టత



అమరావతి: రాజధాని అమరావతి పరిధిలో గ్రామకంఠం మినహాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. 08-12-2014ను కటాఫ్ తేదీగా తీసుకుని.. ఆ తేదీకి ముందే నిర్మాణాలు ఉన్న భూములు, చదరపు గజాల ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు జరిగిన ప్లాట్లను నిబంధనల ప్రకారం మినహాయింపునకు పరిగణించినట్లు తెలిపింది. గ్రామ నివాస ప్రాంతానికి దూరంగా ఉన్న ఖాళీ వ్యవసాయ భూములు, కటాఫ్ తేదీ తర్వాత రిజిస్ట్రేషన్లు జరిగిన భూములకు మినహాయింపు వర్తించదని స్పష్టం చేసింది. ఇప్పటికే 6,473.72 ఎకరాలను ఎల్‌పీఎస్ నుంచి మినహాయించగా.. అపరిష్కృత దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం 2026 జనవరిలో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి వచ్చిన 685 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులు, శాటిలైట్ చిత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాల ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించింది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనల ప్రకారం అర్హులకు అన్ని ప్రయోజనాలు అందిస్తామని సీఆర్డీఏ (CRDA) స్పష్టం చేసింది.

## కడప జిల్లాలో దాల్మియా సిమెంట్స్ భారీ విస్తరణ

అమరావతి: రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమ్మర్ల గ్రామంలోని ప్రముఖ సిమెంట్ దిగ్గజం ఎమ్మెస్సెస్ దాల్మియా సిమెంట్ లిమిటెడ్ క్లింకర్, సిమెంట్ కర్మాగార విస్తరణకు అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. కంపెనీ ప్రతిపాదించిన విస్తరణ ప్రణాళికకు అనుగుణంగా 250 ఎకరాల భూమిని వాస్తవ ఖరీదు ప్రాతిపదికన కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 18న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఈ ప్రాజెక్టుపై విస్తృతంగా చర్చించి, సిఫార్సులు చేయడంతో ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 7.23 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తిగా అంచనా వేయగా, తాజాగా దాన్ని మరింత పెంచుతూ 9.60 MTPAకు సవరించారు. ఈ మేరకు గతంలో ఇచ్చిన జీఓ నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కంపెనీ నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేసి వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించేలా టైమ్‌లైన్‌ను ఖరారు చేశారు.

## పోలీసు యూనిఫాం గౌరవాన్ని, డిపార్ట్‌మెంట్ ప్రతిష్ఠను కాపాడాలి: టీజీ భరత్



పోలీసు శాఖలోకి కొత్తగా అడుగుపెడుతున్న యువ కానిస్టేబుళ్లు కర్నూలులోని ఏపీఎస్పీ 2వ బెటాలియన్ లో పాసింగ్ అవుట్ పరేడ్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ మంత్రి టీజీ భరత్ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 629 మంది ట్రైనీ కానిస్టేబుళ్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొత్తగా బాధ్యతలు చేపడుతున్న కానిస్టేబుళ్లు విధులను సక్రమంగా నిర్వర్తించడమే కాకుండా, తాము ధరించిన యూనిఫాం గౌరవాన్ని, డిపార్ట్‌మెంట్ ప్రతిష్ఠను ఎల్లప్పుడూ కాపాడాలని పిలుపునిచ్చారు. నేటి ఆధునిక కాలంలో నేరాల తీరు మారిపోతోందని మంత్రి పేర్కొన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మహిళలు అలాగే చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు నేటి పోలీసులకు సవాలుగా మారుతున్నాయని గుర్తుచేశారు. ఈ క్రైమ్స్‌ను ఎదుర్కోవాలంటే కేవలం సంప్రదాయ పద్ధతులే కాకుండా డిజిటల్ పరిజ్ఞానం తప్పనిసరి అని స్పష్టం చేశారు. మొబైల్స్, కంప్యూటర్లు, సీసీటీవీ ఫుటేజ్, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి పక్కా ఆధారాలు సేకరించడంలో మన పోలీసులు నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. భవిష్యత్తు అంతా టెక్నాలజీ, డేటా ఆధారిత పోలీసింగ్‌దేనని, కొత్త తరం సిబ్బంది ఈ ఆధునిక సాంకేతికతను వేగంగా ఒడిసిపట్టాలని ఆకాంక్షించారు.

# స్థానిక ఎన్నికలపై పవన్ ఫోకస్.. సమన్వయ కమిటీకి కీలక ఆదేశాలు

- **స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమీక్ష**
- **సమన్వయ కేంద్ర కమిటీ సభ్యులతో భేటీ అయిన పవన్**
- **క్షేత్రస్థాయి నివేదికలతో సిద్ధంగా ఉండాలని కమిటీకి సూచన**
- **కార్యాచరణ ఖరారుపై సోమవారం మరోసారి సమావేశం**

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిన్న సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ శ్రేణులు అందించిన సమాచారాన్ని క్రోడీకరించి, నివేదించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీతో ఈ భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ విధివిధానాలు, బాధ్యతలపై పవన్ కల్యాణ్ సభ్యులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన సమగ్ర సమాచారంతో నివేదికలు



సిద్ధం చేయాలని, సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు వివరాలను తనకు నివేదించాలని సూచించారు. కమిటీ కార్యకలాపాలకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు సోమవారం మరోసారి సమావేశం కావాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, పులపర్తి ప్రశాంత్, యనమల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?: శ్రీకృష్ణదేవరాయలు

వైసీపీ అధినేత జగన్‌పై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ది అవకాశవాద, ద్వంద్వ వైఖరి అని ఆరోపిస్తూ సోషల్ మీడియా వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. ఆయన రాజకీయ సౌలభ్యం కోసం వైఖరులు మార్చుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇదే ప్రక్రియను ప్రామాణికంగా తీసుకున్నారని లావు గుర్తుచేశారు. "ఎస్ఐఆర్ పూర్తయ్యాకే స్థానిక సంస్థల



ఎన్నికలు నిర్వహించాలని మీ పార్టీ ఎమ్మెల్సీ లెల్ల అప్పిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం వాస్తవం కాదా? కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటంలోని ఆంతర్యమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగిస్తూ 2023లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టానికి వైసీపీ మద్దతు ఇచ్చిందని లావు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు, ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా ప్యానెల్‌లో ఉండాలని జగన్ డిమాండ్ చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఈ ఆకస్మిక మార్పుల వెనుక రాజకీయ వ్యూహం ఉందని లావు అనుమానం వ్యక్తం చేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తన మాతృ సంస్థ అయిన కాంగ్రెస్‌తో రాజకీయంగా కలవాలనే ఉద్దేశంతోనే జగన్ ఇలా తన వైఖరిని మార్చుకుంటున్నారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

## మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి: ప్రధానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

- **హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ**
- **పీవీ, మన్మోహన్ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని వ్యాఖ్య**
- **మౌనాన్ని భాషగా మార్చి గొప్ప పాలన అందించారని ప్రశంస**

మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మౌనాన్ని తన భాషగా మార్చుకుని, దేశానికి అద్భుతమైన పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అంతటి మహనీయుడికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ



విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకుని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దార్శనికత వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, దాని ఫలితంగానే నేడు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాన్ని తీసుకువచ్చి, భూనిర్వాసితుల అంగీకారాన్ని తప్పనిసరి చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. మన్మోహన్ సింగ్ జీవితం నేటి 'జెన్‌జెడ్' సహా అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం: బీసీ జనార్దన్ రెడ్డి

- **ఏవియేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ**
- **పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుందన్న మంత్రి**
- **ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు బీసీ జనార్దన్ ప్రకటన**



రాష్ట్రంలోనే ప్రప్రథమంగా కర్నూలు ఎయిర్‌పోర్టులో ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి రావడం చరిత్రాత్మకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు విమానాశ్రయం వేదికగా ఈరోజు 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ' ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ సిరి, స్థానిక ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యామ్ బాబుతో పాటు అకాడమీ చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడిన మంత్రి జనార్దన్ రెడ్డి... ఓర్వకల్లులో అత్యాధునిక హంగులతో 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. దీన్ని రెండు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతలో 180 ఎకరాల్లో, ఆ తర్వాత రెండో దశలో మరో 400 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో 2017లో కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పునాదిరాయి వేసి, అతి తక్కువ కాలంలోనే దానిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని జనార్దన్ రెడ్డి గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఏవియేషన్ సెక్టార్‌లో ప్రొఫెషనల్స్, పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరగనుందని తెలిపారు. ఈ కొత్త ట్రైనింగ్ సెంటర్ ద్వారా కర్నూలు జిల్లా యువతతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు విమానయాన రంగంలో నిపుణులుగా శిక్షణ పొందే సువర్ణావకాశం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మతసామరస్యానికి ప్రతీక.. గణపతి ఊరేగింపులో 'భర్ దో ఝోలీ'

- **చార్మినార్ వద్ద గణేశ్ శోభాయాత్రలో ఖవ్వాలి సందడి**
- **'భర్ దో ఝోలీ మేరీ యా మొహమ్మద్' పాటతో భక్తుల నృత్యాలు**
- **హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీకగా నెటిజన్ల ప్రశంసలు**
- **2022లోనూ మక్కా మసీదు వద్ద ఇదే తరహా ఘటన**
- **సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో**



హైదరాబాద్ నగరం తన విశిష్టమైన మత సామరస్య సంస్కృతిని మరోసారి చాటిచెప్పింది. శుక్రవారం రాత్రి చార్మినార్ పరిసరాల్లో జరిగిన గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో ఒక అపూర్వ దృశ్యం ఆవిష్కృతమైంది. సాధారణంగా డీజే హోరుతో సాగే గణేశ్ ఊరేగింపులకు భిన్నంగా, ఇక్కడ అద్నాన్ సమీ ఆలపించిన ప్రసిద్ధ ఖవ్వాలి 'భర్ దో ఝోలీ మేరీ యా మొహమ్మద్' ప్రతిధ్వనించింది. 2015లో విడుదలైన 'బజరంగీ భాయిజాన్' చిత్రంలోని ఈ సూఫీ గీతానికి భక్తులు ఉత్సాహంగా నృత్యం చేస్తూ శోభాయాత్రలో ముందుకు కదిలారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. హైదరాబాద్‌కే ప్రత్యేకమైన 'గంగా జమున తహజీబ్'కు ఇది నిలువెత్తు నిదర్శనమంటూ నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. భిన్న మతాల వారు పరస్పరం గౌరవించుకునే నగర విశిష్ట సంస్కృతిని ఈ ఘటన ప్రతిబింబించిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఇదేం మొదటిసారి కాదు. 2022లో సైతం పాతబస్తీలోని మక్కా మసీదు సమీపంలో జరిగిన గణేశ్ విగ్రహ ఊరేగింపులో ఇదే ఖవ్వాలీని ప్లే చేయగా, స్థానికులు ఎంతో ఆనందంగా ఆస్వాదించారు. తాజా ఘటనతో భాగ్యనగరం మరోసారి తన సోదరభావానికి, సాంస్కృతిక సమైక్యతకు మారుపేరుగా నిలిచింది.

## కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ పాలన: మంత్రి పొంగులేటి

జనగామ: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ పాలన సాగుతోందని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జనగామలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. దసరా నాటికి 2,18,000 ఇళ్లు పూర్తవుతాయన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేవలం కొన్ని నియోజకవర్గాలకే ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేదల కోసం పని చేస్తుందని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను




కూడా కొనసాగిస్తున్నామని శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు.. ప్రభుత్వం కీలక ప్రకటన

- **కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రంగం సిద్ధం**
- **నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం**
- **2027 వర్షా కాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం**
- **అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు సమర్పించనున్న అధికారులు**
- **భద్రత, నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి ఉత్తమ్**

కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం,



సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

## గణేశ్ నిమజ్జనం సక్సెస్.. పోలీసులతో కలిసి డ్యాన్స్ చేసిన సీపీ సజ్జనార్

హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును విజయవంతంగా నిర్వహించడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తన సిబ్బందితో కలిసి సంబరాలు జరుపుకున్నారు. నిమజ్జన ప్రక్రియ ముగిసిన అనంతరం, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ కింద పోలీసు సిబ్బందితో కలిసి సీపీ సజ్జనార్ నృత్యం చేశారు. 'ది ప్యారడైజ్' చిత్రంలోని 'ఆయా షేర్' పాటకు ఆయన చిందులేశారు. గత కొన్ని రోజులుగా విధుల్లో నిమగ్నమై అప్రమత్తంగా ఉన్న పోలీసులు, నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి కావడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

- **రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్**
- **హామీలు అమలు కాలేదని ఆరోపణ**
- **కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి**
- **2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా**
- **సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు**

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని



వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28 నుంచి చేపట్టే పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

# 'సర్' నోటీసులు.. అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు: ఈసీ

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (SIR)పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. సర్ నోటీసులు అందుకున్న ఓటర్లు.. అత్యవసరమైన సందర్భాల్లో తప్ప వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపింది. 'సర్'కోసం ఫారం 6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డా.సుఖ్‌బీర్ సింగ్ సంధూ, డా.వివేక్ జోషి నేడు దిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. 'సర్'పై భిన్నాభిప్రాయాల అంశం తీవ్ర దుమారం రేపిన వేళ.. ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి ఎన్నికల కమిషనర్లు రాసిన లేఖ.. ఈసీ




లేదా ఐటీ విభాగాల విధానపరమైన అంశానికి సంబంధించినది కాదని, ఈసీకి డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారి పనితీరుకు సంబంధించిందని ఎన్నికల సంఘం వివరించింది. సీఈసీ, ఎన్నికల కమిషనర్ల సమావేశం అనంతరం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

- "బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. తమ పేర్లు నమోదు కాకుండా మిగిలిపోయిన వారు, యువకులు, మొదటిసారి ఓటు వేసేవారు.. నిరంతర అప్‌డేషన్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు కోసం సంబంధిత ఈఆర్‌వోకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఓటర్ల నమోదుకు ఎన్నికల అధికారులు తక్షణమే స్పెషల్ డ్రైవ్ ప్రారంభించనున్నారు.
- దేశవ్యాప్తంగా 'సర్' నిర్వహణ సహా ఈ మధ్య కాలంలో ఈసీ అనేక నిర్ణయాలు తీసుకుంది. బిహార్ నుంచి మొదలు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కోసం గతేడాది జూన్ 24నాటి ఆదేశాలు ఎన్నికల కమిషన్ ఏకగ్రీవ ఆమోదంతోనే జారీ అయ్యాయి. దీన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా సమర్థించింది" అని ఈసీ తెలిపింది.
- గోవాలో 97 మంది అర్హులకు తుది ఓటర్ల జాబితాలో చోటుదక్కకపోవడంపై స్పందిస్తూ.. "ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హుల నుంచి దరఖాస్తులు సేకరణకు ఇంటింటికీ వెళ్లాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులను గోవా సీఈవో ఆదేశించారు. ఆ 97 మంది ఓటర్లలో ఇప్పటికే 81 మంది 'ఫారం 6' నింపారు" అని వెల్లడించింది.

## ఇదీ ఏఐ ఎఫెక్ట్.. గిటార్‌కు హెల్మెట్ లేదని బైకర్‌కు జరిమానా

చిత్రదుర్గం: ఏఐని గుడ్డిగా నమ్మొద్దని చెప్పేందుకు ఇదో ఉదాహరణ. ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి.. గిటార్ తగిలించుకోగా..దానిని వ్యక్తిగా భావించి.. హెల్మెట్‌లేదని ఏఐ ట్రాఫిక్ కెమెరా రికార్డు చేసి నోటీసులు పంపింది. ఈ ఘటన బెంగళూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..



సౌమిక్ దత్త అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు.

అతడి వెనక ఓ గిటార్ ఉంది. ఏఐ కెమెరా దానిని పసిగట్టి.. మనిషిగా భావించింది. అతడికి హెల్మెట్ లేదని, వాహనం నెంబరు రికార్డు చేసి, యజమానికి ఫొటోతోపాటు జరిమానా నోటీసు పంపింది. అతడు ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది.

## 'పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు'.. మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?

- **బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు**
- **విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకే ఈ విజ్ఞప్తి**
- **పండగల సీజన్‌లో ఈ పిలుపునకు స్పందనపై ఉత్కంఠ**
- **వినాయక చవితికి 15 శాతం మేర తగ్గిన బంగారం అమ్మకాలు**
- **పెట్టుబడికి భౌతిక బంగారం కన్నా ఈటీఎఫ్‌లు మేలంటున్న నిపుణులు**

అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్‌తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన



వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో, 2026 మే నెలలో మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. తాజాగా సెప్టెంబర్‌లోనూ ఆయన ఇదే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ తన అవసరాలకు సంబంధించి అత్యధిక శాతం బంగారాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. 2026 రెండో త్రైమాసికంలో దేశీయ సరఫరాలో 82 శాతం దిగుమతుల నుంచే లభించింది. దీనివల్ల డాలర్ల రూపంలో చెల్లింపులు పెరిగి, సుమారు 780 నుంచి 785 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రధాని విజ్ఞప్తి ప్రభావం ఇప్పటికే కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అనవసర కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా బంగారం అమ్మకాల పరిమాణం సుమారు 15 శాతం మేర తగ్గింది. వినియోగదారులు ఎక్కువగా తేలికపాటి ఆభరణాలను ఎంచుకోవడం లేదా పాత బంగారాన్ని మార్చుకోవడం వంటి పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు. పండగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం, భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని గ్రోత్‌వైన్ క్యాపిటల్ నిపుణుడు శుభమ్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే తగినంత బంగారం ఉన్నవారు ఈసారి లాంఛనంగా కొద్ది మొత్తంలో కొనుగోలు చేయడం మేలని ఆయన సూచించారు. కేవలం పెట్టుబడి కోసమైతే, భౌతిక బంగారానికి బదులుగా గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమ ప్రత్యామ్నాయాలని ఆయన వివరించారు. ఏదేమైనా, ప్రధాని పిలుపునకు అసలైన పరీక్ష రాబోయే పండగల సీజన్‌లోనే ఎదురుకానుంది.

## మాదకద్రవ్యాలు.. ప్రతి ఐదుగురు టీనేజర్లలో ఒకరు: సీజేఐ

దేశంలో నానాటికీ పెరిగిపోతున్న డ్రగ్స్ సమస్యపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల అంశాన్ని ప్రజారోగ్య సమస్యగా కాకుండా.. దాని బారి నుంచి పిల్లలను కాపాడాల్సిన అంశంగా చూడాలన్నారు. దేశంలో కౌమారదశలో ఉన్న ప్రతి ఐదుగురు పిల్లల్లో ఒకరు మాదకద్రవ్యాల బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ఇటీవల విడుదలైన లాన్సెట్ అధ్యయనాన్ని ఉటంకించారు. డ్రగ్స్ బారిన పడిన యువత వాటి నుంచి బయటకు రావడానికి కావాల్సిన మద్దతును కుటుంబసభ్యులు, సమాజం వారికి ఇవ్వాలని సూచించారు. వారితో సున్నితంగా వ్యవహరించాలన్నారు. సరదాకో, స్నేహితుల ప్రోద్బలంతోనో గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు చేరువై క్రమంగా ఆ ఊబిలో కూరుకుపోతున్న




వారిలో చాలామంది మానసిక రుగ్మతలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. యువత శారీరకంగా మానసికంగా చురుగ్గా ఉంటేనే అభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ నెగ్గుకురాగలుగుతుందని.. అన్ని రంగాల్లో ప్రపంచానికి తన సత్తాను చాటగలుగుతుందని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించి.. మంచి స్థాయికి చేరుకునేలా పిల్లలను ప్రోత్సహించాలని సీజేఐ ప్రజలకు సూచించారు.

## వారిని కాదు.. ధైర్యముంటే నన్ను అడ్డుకోండి: భాజపాకు దీదీ సవాల్

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సెరాంపుర్‌లో జరగాల్సిన తన ర్యాలీకి వెళ్లకుండా తమ వర్గం నేతలను భాజపా గూండాలు అడ్డుకున్నారని ఆరోపించారు. కొందరిని గృహ నిర్బంధం చేశారని..మరికొందరిని దారిలో అడ్డుకొని, వాహనాలు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమ వేదికకు వెళ్లే మార్గాన్ని సైతం తమ ఆధీనంలోకి తీసుకొని.. కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. నిజంగా ధైర్యముంటే తమ నేతలను కాకుండా తనను అడ్డుకోవాలని దీదీ భాజపాకు సవాల్ విసిరారు. 'మా నేతలు కొందరిని గృహ నిర్బంధంలో ఉంచారు. ర్యాలీ జరిగే ప్రదేశానికి



వెళ్లనివ్వడం లేదు. కోర్టు అనుమతితోనే ర్యాలీ నిర్వహిస్తున్నాం. ఇది సజావుగా సాగేలా చూడడం పోలీసులు, అధికార యంత్రాంగం బాధ్యత. కానీ వారు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యదేశమైన భారత్‌లో ఇటువంటి దాడులు జరగడం సిగ్గుచేటు. ర్యాలీకి వెళ్లకుండా చేయడానికి ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆగేదీ లేదు. సభకు వెళ్లి ప్రసంగిస్తాను. సాధ్యమైతే నన్ను ఆపండి' అని మమత పేర్కొన్నారు.

**కునాల్ ఘోష్ కారుపై గుడ్లు..రాళ్ల దాడి..**

మమతా బెనర్జీ ర్యాలీకి వెళ్తున్న ఆమె వర్గం ఎమ్మెల్యే కునాల్ ఘోష్ ను కొందరు దుండగులు హుగ్లీ జిల్లాలో అడ్డుకున్నారు. నల్ల జెండాలు పట్టుకున్న కొందరు ఆయన కారుపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేశారు. దీంతో ముందుకు వెళ్లడానికి అవకాశం లేక ఆయన వెనుదిరగాల్సి వచ్చింది. ఈ ఘటనలో కారు అద్దాలు పగిలిపోయినట్లు తెలుస్తోంది.

## 10 శాతం వృద్ధి సాధ్యమే: టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు**
- **ఏఐ, సెమీకండక్టర్లకు భారీగా నిధులు కేటాయించాలని సూచన**
- **చిన్న పరిశ్రమల్లోనూ ఏఐ వాడకం పెరగాలని వ్యాఖ్య**

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి,



శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు. దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

## సీఈసీ వివాదం.. 30న 'ఇండియా కూటమి' నేతల భేటీ




దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ఒత్తిడి పెంచే దిశగా విపక్షాలు కార్యాచరణకు సిద్ధమయ్యాయి. ఈ అంశంపై చేపట్టాల్సిన ఆందోళనలపై చర్చించేందుకు ఇండియా కూటమి నేతలు ఈ నెల 30న దిల్లీలో భేటీ కానున్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తప్పించాలనే తమ డిమాండ్‌పై పరస్పరం సంప్రదింపులు జరిపి.. ఉమ్మడి నిర్ణయం తీసుకోనున్నారు. ఈ విషయంపై 29న కాంగ్రెస్ ప్రత్యేకంగా సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు మరోసారి పార్లమెంటు ఉభయ సభల్లో నోటీసులు ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన 73 మంది రాజ్యసభ సభ్యులతో కూడిన ప్రతిపక్ష కూటమి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ అభిశంసన నోటీసు ఇచ్చింది. అది రాజ్యసభలో పెండింగ్‌లో ఉంది. అది అలా ఉండగానే మరోసారి నోటీసు ఇవ్వాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. కాగా.. సర్ ప్రక్రియలో అవకతవకలు, ఇతర సమస్యలపై ఇప్పటికే 23 రాజకీయ పార్టీలు, ఓ స్వతంత్ర ఎంపీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ను సంప్రదించారు.

## నవంబర్ తర్వాత ఇరాన్‌పై మళ్లీ బాంబులు.. శాంతి ప్రణాళికను తిరస్కరించిన ట్రంప్..!

కాల్పుల విరమణ కోసం ఇరాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. నవంబరులో అగ్రరాజ్యంలో జరగనున్న మధ్యంతర ఎన్నికల తర్వాత.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసేందుకు సిద్ధమవ్వాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా తమ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే.. అందుకు బదులుగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు అణుచర్చలను పునరుద్ధరిస్తామని టెహ్రాన్ ప్రతిపాదించింది. ఖతార్ మధ్యవర్తుల ద్వారా ఈ శాంతి ప్రణాళికను అగ్రరాజ్యానికి తెలియజేశామని.. దీనిపై ఒప్పందం కుదిరితే హర్మూజ్‌ను ఏడు రోజుల్లో తిరిగి తెరుస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పేర్కొన్న విషయం తెలిసిందే.

## విజయ్ సినిమాలు మానేశారని ఎవరు చెప్పారు.. స్టాలిన్ విమర్శలు

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సినిమాలు చేయడం మానేశానని చెబుతున్నప్పటికీ.. ప్రజల ముందు ఇంకా నటిస్తూనే ఉన్నారని మాజీ సీఎం ఎంకే స్టాలిన్ విమర్శించారు. మదురాంతకం అసెంబ్లీ ఉపఎన్నిక ప్రచారంలో విజయ్ నటించడం తాను చూశానని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. టీవీకే స్వచ్ఛమైన శక్తి, డీఎంకే దుష్ట శక్తి అని విజయ్ అన్న మాటలను ప్రస్తావిస్తూ స్టాలిన్ తీవ్రంగా మండిపడ్డారు. "విజయ్ పాలనలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఓవైపు అన్నాడీఎంకే



, ఎన్డీయే కూటమి నాయకులను కొనుగోలు చేస్తున్న ఆయన.. తన టీవీకే పార్టీని స్వచ్ఛమైన శక్తిగా అభివర్ణించుకోవడం సిగ్గుచేటు. డీఎంకే పథకాలనే పేరు మార్చి టీవీకే అమలు చేస్తోంది. విద్యుత్ కోతలు, ధరల పెరుగుదల, పాల కొరత, శాంతిభద్రతల అంశాలపై ప్రభుత్వ తీరు గందరగోళంగా ఉంది. జెమ్ గ్రానైట్స్ ఛైర్మన్ ఆర్.వీరమణికి సంబంధించిన పోక్సో కేసులో డీఎంకేపై విజయ్ చేస్తోన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం. ఈ అంశంపై అసెంబ్లీలో ఇప్పటికే నా వైఖరిని వివరించా. దర్యాప్తు అంశాలను రాజకీయంగా వాడుకోవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశాలిచ్చింది. అయినా ఎన్నికల ప్రచారంలో విజయ్ దాన్ని ప్రస్తావిస్తున్నారు. సీఎం హోదాకు తగిన విధంగా ఆయన రాజకీయ సంయమనం పాటించాలి. అంతేగానీ, ఇలా ప్రజల ముందు నటించొద్దు" అని స్టాలిన్ దుయ్యబట్టారు.




# ఏఐతో మోసగించి.. ఇటలీ బ్యాంకుకు రూ.1000కోట్ల కుచ్చుటోపి



కేటుగాళ్లు ఏఐని ఉపయోగించి.. ఓ బ్యాంకుకు రూ.వేల కోట్లు కుచ్చుటోపి వేశారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా నమ్మించి రూ.1034 కోట్లు కొల్లగొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ భారీ మోసం ఇటలీలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు ఇంటెసా శాన్‌పాలోలో చోటుచేసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇంతకీ ఏం జరిగిందంటే..? ఇటలీలో అతిపెద్ద బ్యాంకు ఇంటెసా శాన్‌పాలో సంబంధిత విభాగమైన ఫిద్యూరమ్ మాజీ ఛైర్మన్ పావొలో మోలెసినిని ఫిబ్రవరిలో కేటుగాళ్లు బురిడీ కొట్టించారు. ఇంటెసా శాన్‌పాలో సీఈఓ కార్లో మెస్సీనాలా నమ్మబలికి ఏఐ వాయిస్ క్లోనింగ్ సృష్టించి ఫోన్ కాల్ చేశారు. దీంతో మాజీ ఛైర్మన్ పావొలో ఇదంతా నిజమనుకొని.. విదేశీ ఖాతాల్లోని నిధులను ట్రాన్స్‌ఫర్ చేయాలని తన ఫైనాన్స్ విభాగాన్ని ఆదేశించారు. అనుమానాస్పద లావాదేవీలను ఫిద్యూరమ్ సంస్థ వెంటనే గుర్తించి.. తక్షణమే విదేశాల్లోని బ్యాంకులను, సిబ్బందిని అలర్ట్ చేసినట్లు సదరు కథనాలు తెలిపాయి. ఈ చర్యల వల్ల దాదాపు రూ.570 కోట్ల నగదును రికవరీ చేయగలిగారు. కానీ, మిగతా మొత్తం పలు విదేశీ ఖాతాల్లోకి బిట్‌కాయిన్, ఇతర క్రిప్టోకరెన్సీలుగా మారిపోవడంతో వాటిని గుర్తించలేకపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది.

## సమ్మె కాలంలో ఏటీఎం
# లావాదేవీలపై రుసుముల రద్దు



వారంలో 5 రోజుల పని కావాలనే ప్రధాన డిమాండ్‌తో, ప్రభుత్వ బ్యాంకుల ఉద్యోగులు ఈనెల 28 నుంచి 30 వరకు సమ్మె చేస్తుండగా.. వారికి అటువంటి హామీ ఇవ్వలేదని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఉద్యోగులకు సంబంధించి చాలా డిమాండ్లు పరిష్కరించినట్లు తెలిపింది. ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగం ఆఖరి 3 రోజులు బ్యాంకులు పనిచేయకపోతే ఇబ్బంది కనుక, ఈనెల 27న (ఆదివారం) బ్యాంకులు పనిచేయాలనీ ప్రభుత్వం ఆదేశించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తో పాటు మిగిలిన ప్రభుత్వరంగ బ్యాంకులన్నీ తమ ఖాతాదారులకు ఊరట కల్పించాయి. ఈ 3 రోజుల వ్యవధిలో దేశవ్యాప్తంగా ఏ బ్యాంకు ఏటీఎంలో నగదు ఉపసంహరించుకున్నా, ఎలాంటి లావాదేవీ రుసుములూ ఉండవని తెలిపాయి.

**ఆదివారం బ్యాంకులు పనిచేస్తాయి**

సమ్మె రోజుల్లో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలుగుతాయి కనుక, బ్యాంకు శాఖల ద్వారానే పూర్తి కావాల్సిన అత్యవసర పనులను.. ఆదివారం చేసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. ఇందుకోసమే తమ బ్యాంకు శాఖలు ఆదివారం (ఈనెల 27) పనిచేస్తాయని తెలిపాయి.. సమ్మెరోజుల్లో నగదు అవసరాల కోసం ఏటీఎంలు, కస్టమర్ సర్వీస్ పాయింట్లను వినియోగించుకోవాలని సూచించాయి. సాధారణ చెల్లింపులు, నగదు బదిలీ కోసం ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, వాట్సప్ బ్యాంకింగ్ సహా యూపీఐ, ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ వంటి డిజిటల్ మార్గాలను ఎంచుకోవాలని స్పష్టం చేశాయి.

**అక్టోబరు 1 నుంచి..**

తన ఖాతాదారులు ఇతర బ్యాంకుల ఏటీఎం వాడకంపై అక్టోబరు 1 నుంచి కొత్త పరిమితులను ఎస్‌బీఐ తీసుకురానుంది. వేతన ఖాతా ఎస్‌బీఐలో ఉన్న వారికి, ఇతర బ్యాంకు ఏటీఎంలలో ప్రస్తుతం ఉన్న 10 ఉచిత లావాదేవీల పరిమితిని 5కు తగ్గించనుంది. ఆ పరిమితి దాటిన తర్వాత చేసే ప్రతి నగదు ఉపసంహరణకు రూ.23 ఛార్జీతో పాటు జీఎస్‌టీ; ఇతర లావాదేవీలకు రూ.11తో పాటు జీఎస్‌టీ వసూలు చేయనుంది.

# భారత్ ఇంధన అవసరాల వైపు.. అమెరికా చూపు

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడినప్పటి నుంచీ భారత్.. ఇంధన దిగుమతుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలోనే భారత్ అవసరాల (Indias Energy Needs)కు తగ్గట్టు ఇంధనం సరఫరా చేయాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు, ఇంధన ఆంక్షల విషయంలో అమెరికా (USA) కఠిన వైఖరి అనుసరిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో భారత్‌కు భారీగా ఇంధన అవసరాలు ఉన్నందున.. ఆ అవకాశాన్ని తాము వినియోగించుకోవాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. యుద్ధం వల్ల కొన్ని నెలలపాటు ఇరాన్, పశ్చిమాసియా దేశాల నుంచి చమురు ఎగుమతులు నిలిచిపోవడంతో ప్రపంచ మార్కెట్‌లో ఇంధన లభ్యత పరిమితంగా ఉందని సదరు అధికారి పేర్కొన్నారు. అయితే వెనెజువెలాపై ట్రంప్ (Donald Trump) చేపట్టిన విజయవంతమైన ఆపరేషన్‌తో ప్రస్తుతం అమెరికా వద్ద పెద్ద మొత్తంలో చమురు నిల్వలు ఉన్నాయన్నారు. భారత్ వంటి మిత్ర దేశాలకు చమురు విక్రయించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అమెరికా కాంగ్రెస్ ఇటీవల 'ద లిండ్సే గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026' బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. దీనిపై ట్రంప్ సంతకం కూడా చేయడంతో ఇది చట్టరూపం దాల్చింది. రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం జరుపుతోన్న భారత్, చైనా వంటి దేశాలపై సుంకాల మోత మోగించేందుకు ఈ చట్టంతో ట్రంప్‌నకు అధికారం లభించినట్లయ్యింది. ఈ కొత్త చట్టం.. భారత్, అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపైనే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపైనా ప్రభావం చూపుతుందని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.




# బ్యాంకింగ్‌లో కొనుగోళ్ల బాజా

దేశీయ ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో మరో భారీ విలీనానికి రంగం సిద్ధమవుతోంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎఫ్‌బీ)ను కొనుగోలు చేసేందుకు కేరళలోని అలువా కేంద్రంగా పనిచేసే ఫెడరల్ బ్యాంక్ తుది దశ చర్చలు జరుపుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందం షేర్ స్వాప్ (ఈక్విటీ షేర్ల మార్పిడి) పద్ధతిలో జరగనుంది. గతంలో కోటక్ మహీంద్రా బ్యాంక్ ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ (2015), ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఫిన్‌కేర్ ఎస్ఎఫ్‌బీ (2023) విలీనాలు ఇదే తరహాలో జరిగాయి. ప్రస్తుతం ఫెడరల్ బ్యాంక్ మార్కెట్ విలువ దాదాపు రూ.82,000 కోట్లు కాగా, జన ఎస్ఎఫ్‌బీ మార్కెట్ విలువ రూ.5,600 కోట్లుగా ఉంది. ప్రాథమిక అంచనాల ప్రకారం.. జన ఎస్ఎఫ్‌బీ షేరును రూ.620 650 శ్రేణిలో, ఫెడరల్ బ్యాంక్ షేరును మార్కెట్ ధరకంటే కాస్త ఎక్కువగా దాదాపు రూ.350 వద్ద లెక్కకట్టి, స్వాప్ రేషియోను ఖరారు చేసేందుకు చర్చలు జరుగుతున్నాయి. బ్యాంకుగా రద్దు కానున్న జన ఎస్ఎఫ్‌బీ: ఈ కొనుగోలు పూర్తయ్యాక, జన ఎస్ఎఫ్‌బీకి చెందిన మొత్తం ఆస్తులు, రుణాలు ఫెడరల్ బ్యాంక్‌లో విలీనమవుతాయి. తద్వారా జన ఎస్ఎఫ్‌బీ స్వతంత్ర బ్యాంకుగా ఉనికి కోల్పోతుంది. ఈ బ్యాంకు హోల్డింగ్ కంపెనీ అయిన జన హోల్డింగ్స్‌లో ప్రధాన పెట్టుబడిదారు అయిన అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం టీపీజీ.. ఈ ఒప్పందం ద్వారా నిష్క్రమించనుంది. ఫెడరల్ బ్యాంక్‌కే ఎక్కువ ప్రయోజనం: ఆర్‌బీఐ నిర్దేశించిన ప్రాధాన్యతా రంగ రుణాల లక్ష్యాలను చేరుకోవడానికి జన ఎస్ఎఫ్‌బీ మైక్రోఫైనాన్స్ పోర్ట్‌ఫోలియో, ఫెడరల్ బ్యాంక్‌కు దోహదపడనుంది. ఉత్తర, మధ్య భారత్‌లోని అట్టడుగు వర్గాలకు విస్తరించిన జన బ్యాంక్ ద్వారా ఫెడరల్ బ్యాంక్ లాభదాయకత పెరగడంతో పాటు సేవలూ విస్తరించనున్నాయి. కొన్ని చిక్కులు కూడా ఉన్నాయ్: 2026 జూన్‌కు ఫెడరల్ బ్యాంక్ రుణాల పోర్ట్‌ఫోలియో రూ.2.77 లక్షల కోట్లు కాగా, బ్యాంక్‌లో 17,000 మంది ఉద్యోగులు ఉన్నారు. కేవలం రూ.37,600 కోట్ల రుణాల పోర్ట్‌ఫోలియో కలిగిన జన ఎస్ఎఫ్‌బీలో 26,000 మంది పనిచేస్తున్నారు.




# ఆసియా క్రీడల్లో సావన్ చరిత్ర.. 44 ఏళ్ల తర్వాత మారథాన్‌లో రజతం




జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్, హవల్దార్ సావన్ బర్వాల్ (Sawan Barwal) చరిత్ర సృష్టించాడు. 44 ఏళ్ల తర్వాత భారత్‌కు మారథాన్‌లో పతకం తీసుకొచ్చాడు. శనివారం జరిగిన పురుషుల మారథాన్‌లో సావన్ 2:11:37 గంటల వ్యవధిలో రేసును ముగించి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో ఈ విభాగంలో భారత సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన 28 ఏళ్ల సావన్ బర్వాల్ భారత ఆర్మీలో హవల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రేసు (Asian Games) ప్రారంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించిన సావన్.. 35 కిలోమీటర్ల మార్క్ వరకు ముందంజలోనే ఉన్నాడు. చివరి 7 కిలోమీటర్లలో కాస్త నెమ్మదించడంతో రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ రేసులో జపాన్‌కు చెందిన ఇచితాకా యమషితా 2:10:49 గంటల వ్యవధిలో గమ్యం చేరుకొని సొంత గడ్డపై స్వర్ణాన్ని సొంతం చేసుకున్నాడు. కేవలం 48 సెకన్ల తేడాతో సావన్‌కు పసిడి పతకం చేజారడం గమనార్హం. ఇక, చైనాకు చెందిన పేయూ.. కాంస్య పతకం సాధించాడు. ఆసియా క్రీడల మారథాన్‌లో భారత్‌కు పతకం రావడం ఇది నాలుగోసారి. 1951లో దిల్లీలో జరిగిన క్రీడల్లో భారత్‌కు స్వర్ణం, కాంస్యం వచ్చాయి. ఆ తర్వాత 1982లోనూ మన దేశంలో ఆసియా క్రీడలు జరగ్గా.. సీతారాం కాంస్యం సొంతం చేసుకున్నాడు. మళ్లీ ఇప్పుడు 44 ఏళ్ల తర్వాత సావన్ విదేశీ గడ్డపై రజతంతో మెరిశాడు. ఇక, తాజా పోటీల్లో సావన్ 2:11:37 గంటల్లో రేసును పూర్తిచేశాడు. ఇది అతడి కెరీర్‌లోనే వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన కావడం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్‌లో నెదర్లాండ్స్‌లో జరిగిన మారథాన్ పోటీల్లో సావన్.. 2:11:58 గంటల్లో రేసు ముగించాడు. గతంలో భారత మారథాన్ రన్నర్ శివనాథ్ సింగ్ పేరు మీదున్న రికార్డును (2.12.00 గంటల) తిరగరాశాడు. ఇప్పుడు దాన్ని కూడా అధిగమించడం విశేషం.



## ఇదే నా చివరి ప్రపంచకప్..
# సర్వశక్తులూ ధారపోస్తా: కోహ్లీ

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలక వ్యాఖ్యలు చేశాడు. వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచ కప్.. దేశం తరఫున తాను ఆడే చివరి మెగా టోర్నీ అని స్పష్టం చేశాడు. ఆ ట్రోఫీని కైవసం చేసుకునేందుకు మైదానంలో తన సర్వశక్తులూ ధారపోస్తానని తెలిపాడు. ఈ నెల 27 నుంచి వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌కు ముందు 'జియోస్టార్'తో కోహ్లీ మాట్లాడాడు. వచ్చే ఏడాది సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా వన్డే ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ''భారత్ తరఫున ఆడబోయే చివరి వరల్డ్‌కప్ ఇదే. టోర్నీని గెలవడమే నా ఏకైక లక్ష్యం. దాని కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు, మైదానంలో సర్వస్వం ధారపోసేందుకు సిద్ధంగా ఉన్నా'' అని కోహ్లీ వెల్లడించాడు. వన్డే ప్రపంచకప్‌లో ఉండే ఇంటెన్సిటీ మరే ఇతర టోర్నమెంట్‌లోనూ ఉండదని చెప్పాడు. ''ఇందులో దాదాపు 10 మ్యాచ్‌లను టీ20 స్థాయి తీవ్రతతో ఆడాల్సి ఉంటుంది. ఒక వన్డే మ్యాచ్ అనేది 2.5 టీ20లతో సమానం. పెద్ద టోర్నమెంట్ లేదా ప్రపంచకప్‌లో వరుసగా 10 మ్యాచ్‌లపాటు ఆ ఇంటెన్సిటీని కొనసాగించడం చాలా పెద్ద విషయం.'' అని తెలిపాడు.

**అదే అసలైన సవాలు: రోహిత్ శర్మ**

మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ (Rohit Sharma) మాట్లాడుతూ.. ''నేను చేయాల్సిన పని పూర్తయిందనే ఆలోచన ఎప్పుడూ రాదు. ఆడుతున్నంత కాలం.. ఏదో ఒక లక్ష్యం కోసం ఎదురుచూస్తూనే ఉంటాం. ప్రస్తుతం ప్రపంచకప్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ప్రపంచకప్ లేదా ఏదైనా ఐసీసీ టోర్నమెంట్ ఆడేటప్పుడు వేర్వేరు వేదికలపై.. వేర్వేరు ప్రత్యర్థులను ఎదుర్కొంటాం. కాబట్టి, అందుకు తగినట్లు విభిన్నంగా సిద్ధం కావాలి. కొత్తగా ఆలోచించాలి. అదే అసలైన సవాలు'' అని పేర్కొన్నాడు. రాబోయే వన్డే వరల్డ్‌కప్ వరకు ఆడతారా? లేదా? అనే సందేహాలకు ఈ ఇద్దరు తమ వ్యాఖ్యలతో తాజాగా చెక్‌పెట్టినట్లయ్యింది.

# కబడ్డీలో భారత్‌కు డబుల్ బొనాంజా.. అబ్బాయిలూ 'పసిడి' పట్టేశారు!

ఆసియా క్రీడల కబడ్డీలో మన అమ్మాయిలు, అబ్బాయిలు ఇరాన్‌ను గట్టిగానే ఢీకొట్టారు. ఇప్పటికే ఆ దేశాన్ని ఓడించి మహిళల జట్టు స్వర్ణాన్ని దక్కించుకోగా.. పురుషుల జట్టు అదే బాటలో నడిచింది. ఉత్కంఠగా జరిగిన ఫైనల్లో పసిడి కూత పెట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్.. ఇరాన్‌ను 4034 పాయింట్ల తేడాతో ఓడించింది. దీంతో కలిపి ఆసియా క్రీడల చరిత్రలో కబడ్డీ జట్టు తొమ్మిదిసార్లు బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. 2026 ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇది నాలుగో స్వర్ణం. పతకాల పట్టికలో 10వ స్థానం.. 2026 ఆసియా క్రీడల్లో ఇప్పటివరకు నాలుగు స్వర్ణాలతో భారత్ పతకాల పట్టికలో 10వ స్థానంలో నిలిచింది. 2022 ఆసియా క్రీడల్లో భారత్‌కు మొత్తం 106 పతకాలు వచ్చాయి. వాటిలో 28 గోల్డ్‌మెడల్స్. ఈసారి భారత్ నాలుగో స్థానంలో నిలవగా.. చైనా తొలి స్థానంలో నిలిచింది. 11 రజతాలు, 13 కాంస్యాలతో కలిపి మొత్తం 28 పతకాలను సొంతం చేసుకుంది. మహిళల క్రికెట్ ఫైనల్‌లో హర్మన్ ప్రీత్ సేన అద్భుత విజయంతో తొలి స్వర్ణాన్ని దక్కించుకోగా.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి సింగ్, కమల్‌జీత్ జంట శుక్రవారం పసిడి సొంతం చేసుకున్నారు. ఇక, శనివారం కబడ్డీలో రెండు స్వర్ణాలు వచ్చాయి.




# అమ్మాయిల పసిడి కూత.. ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో గోల్డ్

జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల పతకాల పట్టికలో భారత్‌కు మూడో స్వర్ణం వచ్చి చేరింది. కబడ్డీ పోటీల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన మన అమ్మాయిలు.. ఫైనల్‌లో ఇరాన్‌ను ఓడించి బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. నువ్వా నేనా అన్నట్టు సాగిన ఈ గేమ్‌లో 3734 తేడాతో మన జట్టు ఇరాన్ నుంచి విజయాన్ని లాగేసుకుంది. మరోవైపు రైఫిల్ షూటింగ్‌లో రజతం దక్కగా.. స్క్వాష్ జోడీ సెమీస్‌లో తడబడి, కాంస్యంతో సరిపెట్టుకుంది.

* 50 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్ లో తిలోత్తమా సేన్, విదర్భా వినోద్, ఆషి చౌక్సే రజతాన్ని సొంతం చేసుకున్నారు. ఈ పోటీల్లో చైనా బృందం 1773 పాయింట్లతో పసడి పతకాన్ని దక్కించుకోగా.. భారత బృందానికి 1763 పాయింట్లు రావడంతో రెండో స్థానంలో నిలిచింది. 1754 పాయింట్లు సాధించిన కజకిస్థాన్‌కు కాంస్యం దక్కింది.
* ఇక, స్క్వాష్ విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్ జోడి జోష్న చిన్నప్ప సెంథిల్ కుమార్‌కు కాంస్య పతకం దక్కింది. సెమీస్‌లో హాంకాంగ్ ద్వయం లీ కా యి, తాంగ్ మింగ్ హాంగ్ చేతిలో ఓడింది.
* అంతకుముందు, భారత అథ్లెట్, హవల్దార్ సావన్ బర్వాల్ మారథాన్‌లో చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో రజతంతో మెరిసి 44 ఏళ్ల తర్వాత మన దేశానికి పతకం అందించాడు.



పత్రికతో.. మార్పులు
TN తెలుగు న్యూస్
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..
దిన పత్రిక



# స్టూడెంట్ లీడర్‌గా కయదు లోహర్




వరుసగా స్టార్ హీరోలతో సినిమా చేస్తోన్న కయదు లోహర్ తాజాగా తమిళంలో మరో బంపరాఫర్ అందుకుంది. శివకార్తికేయన్‌తో ఫస్ట్ టైమ్ రొమాన్స్ చేయబోతుంది. డెరెక్టర్ రామ్‌కుమార్ బాలకృష్ణన్ రెండో సినిమా శనివారం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సినిమాలో శివకార్తికేయన్‌కు జోడీగా కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఓపెనింగ్ ఈవెంట్‌కు హీరోతో పాటు కయదు కూడా అటెండ్ అయ్యింది. స్టూడెంట్ పాలిటిక్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కుతోన్నట్లు సమాచారం. ఇందులో శివకార్తికేయన్‌తో పాటు కయదు స్టూడెంట్ లీడర్స్‌గా కనిపిస్తారని అంటున్నారు. కయదు పాత్రలో వచ్చే ట్విస్ట్‌లు అదిరిపోతాయని చెబుతున్నారు. అక్టోబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకాబోతుంది. ఇటీవలే ప్యారడైజ్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది కయదు లోహర్.





## ముహూర్తం దసరాకేనా?

రంగస్థలం తర్వాత రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో మరో మూవీ రాబోతుంది. దసరా సందర్భంగా అక్టోబర్ 20న ఈ సినిమా పూజా కార్యక్రమాలను నిర్వహించబోతున్నట్లు సమాచారం. డిసెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఈ సినిమా ఓపెనింగ్ ఈవెంట్‌కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చీఫ్ గెస్ట్‌గా హాజరుకానున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ మూవీని రూపొందిస్తోన్నట్లు సమాచారం. ఇందులో అంతర్లీనంగా తండ్రీకొడుకుల ఎమోషన్ ఉంటుందని అంటున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోండగా హీరోయిన్లుగా సారా అర్జున్, రుక్మిణి వసంత్ నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.



## రన్యారావు స్మగ్లింగ్ కేసు ఆధారంగా మూవీ

కన్నడ హీరోయిన్ రన్యారావు గోల్డ్ స్మగ్లింగ్ కేసు ఆధారంగా తెలుగు, తమిళ భాషల్లో ఓ బైలింగ్వల్ మూవీ రాబోతుంది. సిటీ ఆఫ్ గోల్డ్ పేరుతో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో టాలీవుడ్ సీనియర్ హీరో రాజశేఖర్ కూతురు శివాత్మిక హీరోయిన్‌గా నటిస్తోంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అమలా షాజీ మరో హీరోయిన్‌గా కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుంది. ఈ సినిమాలో ఆమె పాత్ర రన్యారావును పోలి ఉంటుందని అంటున్నారు. విక్రమ్ ప్రభు హీరోగా నటిస్తుండగా సిద్ధార్థ్ దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్ 24న ఈ సినిమా తెలుగుతో పాటు తమిళంలో రిలీజ్ కాబోతుంది.

## రాజమౌళి కొడుకు మూవీకి గెస్ట్‌గా



డ్రాగన్ షూటింగ్‌లో గాయపడ్డ ఎన్టీఆర్ మూడు నెలల గ్యాప్ తర్వాత ఫస్ట్ టైమ్ మీడియా ముందుకు రాబోతున్నారు. దిగ్గజ దర్శకుడు రాజమౌళి తనయుడు కార్తికేయ నిర్మించిన డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఎన్టీఆర్ చీఫ్ గెస్ట్‌గా హాజరు కానున్నారు. ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈనెల 29న హైదరాబాద్‌లో జరుగబోతుంది. ఈ వేడుకకు ఎన్టీఆర్ చీఫ్ గెస్ట్‌గా అటెండ్ కాబోతున్నారు. ఈ విషయాన్ని నిర్మాత కార్తికేయ ఓ వీడియో ద్వారా అఫీషియల్‌గా ప్రకటించారు. మలయాళ అగ్ర నటుడు ఫహాద్ ఫాజిల్ హీరోగా నటించిన ఫాంటసీ యాక్షన్ మూవీ అక్టోబర్ 2న థియేటర్లలోకి వస్తోంది.



## ఓటీటీలోకి లవ్ వెబ్‌సిరీస్

రజనీకాంత్ కూతురు సౌందర్య తొమ్మిదేళ్ల తర్వాత కోలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తోంది. లవ్ పేరుతో తమిళంలో రొమాంటిక్ వెబ్‌సిరీస్‌ను నిర్మించింది. డేటింగ్ యాప్ కల్చర్‌పై తెరకెక్కిన ఈ సిరీస్ అక్టోబర్ 2 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది. లవ్ పేరుతో రూపొందిన ఈ వెబ్‌సిరీస్‌లో అర్జున్ దాస్, ఐశ్వర్యలక్ష్మి లీడ్ రోల్స్‌లో నటించారు. బాలాజీ మోహన్ దర్శకత్వం వహించారు.

## తెలుగు వెర్షన్‌లోనూ డోరతీ



కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటించిన వివాదాస్పద కోలీవుడ్ మూవీ డోరతి తెలుగులోకి వస్తోంది. అక్టోబర్ 2న తెలుగు వెర్షన్ థియేటర్లలో రిలీజ్ కాబోతుంది. ఈ విషయాన్ని మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించారు. ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. డోరతీ అనే పేరుతోనే ఈ మూవీ విడుదల అవుతోంది. ఈ శుక్రవారం రిలీజైన ఈ సినిమాను బ్యాన్ చేయాలంటూ నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. స్వలింగ సంపర్కం కాన్సెప్ట్‌తో తెరకెక్కిన డోరతీని మలేషియా, ఖతర్‌తో పాటు మరికొన్ని దేశాలు బ్యాన్ చేశాయి. ఈ సినిమా కథ, ఇందులోని సీన్లపై అభ్యంతరాలు వ్యక్తమవుతోన్నాయి. ఇద్దరు మగాళ్లు ప్రేమలో పడటం, వారి మధ్య ఇంటిమేట్ సీన్లు పెట్టడంపై డెరెక్టర్ కారిక్ సుబ్బరాజును నెటిజన్లు ట్రోల్ చేస్తోన్నారు.